PRAMUKHANDHRA 26th Year of Publication We carry the news and views of Telugus

26 వ సంవత్సరం

ప్రముఖాంధ్ర

₹.15

జూన్ 2020

వ్యవస్థాపకులు

శ్రీ గోటేటి శ్రీరామారావు



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

Budget ❖ Plan ❖ Design ❖ Arrange ❖ Manage Weddings

Shubhavivaaham

Complete Solutions for a Grand Wedding

Wedding is a Grand, Joyous and Life time occassion. While you are busy managing your loved ones and are busy with rituals, please allow trusted, experienced Wedding Planners, like us, to organize the event in the most memorable way for you.

Our services ....

- ***Wedding Planners***
- ***Catering Services***
- ***Event Organising***
- ***Video & Photography***
- ***Bride & Groom makeover***
- ***Gifting Solutions***
- ***Personalized Assistance***

&

- ***Matrimonial Services***
- ***Plan / Arrange / Manage***

#64, Thambaiah Reddi Street, West Mambalam, Chennai 600 033, Tamil Nadu, India. Tel : **+91-44-24742091**
Mob : **+91-98400 48941** ❖ **shubham.vivaaham@gmail.com** ❖ Free Registration at : **www.shubhavivaaham.com**

ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జూన్ 2020

సంపుటి : 26 **306** సంచిక : 6

శ్రీరామ రక్షతు వెయ్యేళ్ల ఆయుష్షః !

ఆనాడు తల్లులు బిడ్డలకు తలంటే ముందు, నూనెను పెడుతూ 'శ్రీరామ రక్షతు – వెయ్యేళ్ల ఆయుష్షః' అని దీవించేవారు. ప్రస్తుతం అలా దీవించే తల్లులూ, శ్రీరాముణ్ణి గురించి, తీరిగ్గా తెలుసుకుని బిడ్డలకు జ్ఞానబోధలు చేసే తల్లులూ అరుదుగా ఉన్నారు. ఏతా వాతా తెలిసిన వారున్నప్పటికినీ, వారు ఉద్యోగాల్లోనో, ఊళ్ళేలే రాజకీయాల్లోనే తలమునకలై ఉంటున్నారు. ఒకవేళ వాళ్లకు తీరిక కల్గినా, సెక్యులర్ దేశం కాబట్టి, రామప్రస్తావ నెత్తకూడదు. భారతీయ పౌరసత్వంలో, భారత గాలులు పీలుస్తూ, ఆహార విహారాలు చేస్తూ ఉండవచ్చును గానీ, భారతీయ సాంప్ర దాయాన్నీ, భారతి పేరు మీదుండే సరస్వతీ ప్రార్థననూ, వందేమాత రమ్‌నూ భారతమాతకు జై, ఉచ్చరించకూడదు. MAY GOD BLESS YOU. అల్లాహో అక్బర్–యని యనవచ్చు. దేశీయత పనికిరాదు; దేశ వస్తువులు పనికిరావు. మరి కొందరికి భృతి దొరకనందున 'క్విట్ ఇండియా' అంటూ వారంతట వారు దేశం వదిలి విదేశాలకు పోతున్నారు.

స్వాతంత్ర్యానికి పూర్వం మనం పూర్ణమనంతో విదేశస్థులను మన దేశం వదలిపొమ్మని ఉద్యమాల్ని లేవదీశాం. ఇప్పుడే ఉద్యమమూ చేపట్టకుండానే మన దేశాన్ని, మనవాళ్లే విడిచిపెట్టి వెడ్తున్నారు.

అయితే, వారు అమెరికాలో ఉన్ననూ, ఆస్ట్రేలియలో ఉన్ననూ, ఆఫ్రికాలో ఉన్ననూ, వేఱే దేశంలో ఉన్ననూ, తెలుగు గడ్డమీద, తెలుగు భాషమీదా మమకారం చంపుకోవడంలేదు. ఏ దేశంలో తెలుగు సభలు జరిగిననూ, విదేశాంధ్రులే ఎక్కువగా వస్తున్నారు, ఎప్పుడో విడిచి వెళ్లిన వారి గ్రామాలపై, ప్రజలపై మక్కువను చూపిస్తున్నారు, కొందరు తమ గ్రామాభివృద్ధికి తమ వంతు సహ కారం అందిస్తున్నారు. అయితే తెలుగు చదువనూ, వ్రాయడంలో వారు శ్రద్ధను వహించకపోవడం బాధగా ఉంది. క్రైస్తవ మత ప్రచారంలా, మన భాషాభివృద్ధికీ, సంస్కృతీ పరిరక్షణకూ, మనం ఉద్యమించాల్సిన అవసరం కనిపిస్తున్నది. ఇలా అనడం కూడా ఇప్పుడు పునరుక్తి దోషంగా పరిణమిస్తున్నది. ఒక్కొక్కప్పుడు మాతృ భాషను నేర్చుకోవోయ్ అనో, అమ్మా మీ అబ్బాయికి తెలుగు నేర్పమ్మా – అనో, కటువుగా చెప్పాల్సి వస్తోంది. ఈ తరం తల్లులు తమ సంతతికి తెలుగు చదువనూ, వ్రాయనూ, మాట్లాడడం నేర్పకపోతే, వచ్చే తరానికి 'తెలుగు' అనేదొక భాష ఉందనీ, అది సంస్కృతీ సంపదల నిలయమనీ గ్రహించే భాగ్యం మనకు ఉండదు. తమనంతగా తీర్చిదిద్దిన 'తెలుగు'ను మరిస్తే, భారతమాత సహిం చదు. ఆ తల్లి ఒడిలో పెరిగిన మీరు, 'డాడీ ఏడీ, మమ్మీ డుమ్మీ' అంటూంటే దేశద్రోహం, మాతృద్రోహమవుతుంది. అలాగాకుండా ఉండాలని 'శ్రీరామ రక్షతు – వెయ్యేళ్ల ఆయుష్షు' అంటూ మంగళ పదములు పలుకుచున్నాను. విదేశాలలో నున్న వారిని స్వామి వివేకానందవలె మన దేశ ఔన్న త్యాన్ని చాటగోరుచున్నాను, మీరు ఉన్నత శిఖరాలను అధిష్ఠించాలని కోరుకుంటు న్నాను. విజయోస్తు.

బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

(ఫిబ్రవరి 2002, ప్రముఖాంధ్ర)

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

దక్షిణా మూర్తి స్వరూపం...

దక్షిణామూర్తి విగ్రహాన్ని పరిశీలిస్తే...

కుడిచెవికి మకరకుండలం ఎడమ చెవికి "తాటంకం" అలంకారాలుగా కనిపిస్తాయి. మకరకుండలం పురుషుల శ్రవణాలంకారం. తాటంకం స్త్రీల అలంకృతి, దక్షిణామూర్తిగా సాక్షాత్కరించినది శివశకుల సమైక్య రూపమేనని తెలియజేస్తాయి. ఈ రెండు అలంకారాలు. సనకసనందనాదులకు ముందు రెండుగా కనబడిన శివశక్తులే ఇప్పుడు ఏకాకృతిగా దర్శనమిచ్చాయి. అందుకే దక్షిణామూర్తి అయ్యరూపమే కాక, అమ్మమూర్తి కూడా ఈ విషయాన్నే లలితాసహస్రం ... దక్షిణామూర్తి రూపిణీ "సనకాది సమారాధ్యా శివజ్ఞాన ప్రదాయినీ" అని వివరిస్తోంది.

ఉత్తరాభిముఖులై ఉంటారు. ఉత్తరం జ్ఞానదశ. ఆ దిశలో కూర్చున్న స్వామిని చూస్తూ ఉన్నవారికి వెనుక భాగాన (పృష్ట భాగాన) దక్షిణ దిశ. అంటే యమ (మృత్యు) దీశ. దీని భావం ఎవరు దేవునివైపు చూస్తారో, వారు యముని (మృత్యువుని) చూడరు. యముని చూపు మనపై పడకుండా స్వామి చూపు 'నిఘా', వేస్తుంది. అజ్ఞానమే మృత్యువని ఉపనిషత్తు చేస్తుంది. ఆత్మ స్వరూపాన్ని ఎరుగకపోవడమే మృత్యువు – ప్రమాదం వై మృత్యుమహం బ్రవీమి' యముని సైతం శాసించిన మృత్యుంజయుడే దక్షిణామూర్తి, దక్షిణ' అంటే 'దాక్షిణ్య భావం'..

ఏ దయవలన దుఃఖం పూర్తిగా నిర్మూలనమవుతుందో ఆ 'దయ'ను 'దాక్షిణ్యం' అంటారు. ఈ లోకంలో శాశ్వతంగా దుఃఖాన్ని నిర్మూలించగలిగే శక్తి (దాక్షిణ్యం) భగవంతునికి మాత్రమే ఉంది. ఆ దాక్షిణ్య భావం ప్రకటించిన రూపమే దక్షిణామూర్తి.

అన్ని దుఃఖాలకీ కారణం అజ్ఞానం. అజ్ఞానం పూర్తిగా తొలగితేనే శాశ్వత దుఃఖవిమోచనం. ఆ అజ్ఞానాన్ని (అవిద్యను) తొలగించే జ్ఞాన

స్వరూపుని దాక్షిణ్య విగ్రహమే దక్షిణామూర్తి. వసిష్టుడు కూడా తపస్సుతో దక్షిణామూర్తిని ప్రత్యక్షం చేసుకొని బ్రహ్మావిద్యను సంపాదించాడు. వసిష్ఠునకు దక్షిణామూర్తి సాక్షాత్కరించిన క్షేత్రమే 'శ్రీకాళహస్తి'.

అందుకే ఇప్పటికీ ఆలయంలో ప్రవేశించగానే దక్షిణామూర్తి విగ్రహం కనబడుతుంది. ఇది జ్ఞానప్రధాన క్షేత్రం, ఇక్కడి శక్తి పేరు కూడా జ్ఞాన ప్రసూనాంది కావడం గమనార్తరి, 'రుద్ర యతే దక్షిణం ముఖం తేన మాం పాహి నిత్యమ్'

'ఓ రుద్రా! నీ దక్షిణ ముఖంతో నిత్యం మమ్ము రక్షించు' అని శ్వేతాశ్వతరోపనిషత్తు దక్షిణామూర్తిని ప్రార్థించింది,

పరమజ్ఞానమూర్తియైన ఈ ఆదిగురువును స్తుతిస్తూ ఆదిశంకరులు రచించిన దక్షిణామూర్తి సోత్రము బహుళ ప్రసిద్ది చెందింది.

"విశ్వం దర్పణ దృశ్యమాననగరీతుల్యం..." అంటూ ప్రారంభమై... "గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే" అని మకుటంతో సాగు. ఆ స్తుతిలో అద్వైత వేదాంతమంతా సుప్రతిష్ఠితమయ్యింది. "గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణామ్! నిధయే సర్వ విద్యానాం దక్షిణా మూర్తయే నమః"

దక్షిణామూర్తి సకల జగద్గురు మూర్తి కనుక – స్వామి ఆరాధన సకల విద్యలను ప్రసాదిస్తుంది.

ఐహికంగా – బుద్ధిశక్తిని వృద్ధి చేసి, విద్యలను అనుగ్రహించే ఈ స్వామి, పారమార్థికంగా తత్త్వ జ్ఞానాన్ని ప్రసాదించే దైవం.

– యస్.వి.డి.యస్.శర్మ

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

నడిచే దైవం

కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిని తమిళనాడులో నడమాడే దైవం అని పిలుస్తారు. అంటే నడిచే దైవం అన్నమాట. మొదటిసారి వారి దర్శనభాగ్యం నాకు 1983–84లో మా గురుతుల్యులు శ్రీ టీ.వీ.కే. శాస్త్రి గారి పుణ్యమా అని కలిగింది. మా మద్రాసు తెలుగు అకాడెమీ ఒకానొక కార్యక్రమం ప్రారంభానికి ముందు ఆహ్వాన పత్రిక తొలి ప్రతిని తీసుకుని మేమిద్దరం మద్రాసునుంచి కంచి వెళ్లి పరమాచార్య వారి ఆశీస్సులని పొంది వచ్చాం. ఆ తరువాత 1990 సెప్టెంబర్‌లో నా వివాహానికి ముందు ఆహ్వాన పత్రిక తొలి ప్రతిని తీసుకుని వెళ్లి వారి ఆశీస్సులని పొంది వచ్చాం.

నా బాల్యంలో మా నాన్నగారు తరచూ చెబుతూ వుండేవారు కంచి పరమాచార్య సాక్షాత్తు ఆదిశంకరుల అవతారం అని. వారి సమ్మతి లేకుండా ఒక ప్రఖ్యాత ఛాయాగ్రాహకుడు పరమాచార్య వారి ఫోటో తీయటానికి ప్రయత్నం చేసాడు కానీ ఆ ఫోటోల నెగటివ్‌లు అన్నీ పూర్తిగా శూన్యంగా వచ్చాయని అది చూసి ఆ ఛాయాగ్రాహకుడు విస్తుపోయాడని మా నాన్నగారు మాకు కథలుగా తరచూ చెప్పేవారు. (చూడుడు – https://m.facebook.com/story.php?story_fbid=1698850633538143&substory_index=0&id=6%68285496594667 మరియు సాక్షి వికటన్ సంచిక 15 ఆగస్టు, 2004)

మా బాబాయి గారు సుప్రీంకోర్ట్ సీనియర్ అడ్వొకేట్ (కీ॥శే॥ బచ్చు పార్థసారధి) ఒకసారి కంచి వెళ్ళినప్పుడు పరమాచార్య వారి దర్శనం కోసం క్యూలో నిలబడి అందరితో బాటు వారి వంతు వచ్చినప్పుడు పరమాచార్య మా బాబాయి గారిని దగ్గరకి రమ్మని సైగ చేసి, "నువ్వు బచ్చు జగన్నాథ్ దాస్ కొడుకువి కదా" అని ప్రశ్నించారు. అవునని మా బాబాయి సమాధానం చెప్పగానే, "మీరు శ్రీవైష్ణవులు కదా మరి నువ్వు నుదుట నామం ఎందుకు పెట్టుకోలేదు" అని అడిగారు. బచ్చు జగన్నాథ్ దాస్ గారు సుప్రీం కోర్ట్ న్యాయమూర్తిగా పనిచేశారు. అంతకు ముందు మద్రాసు హైకోర్ట్‌లో న్యాయవాదిగా, ఒరిస్సా హైకోర్ట్ రెండవ ప్రధాన న్యాయమూర్తి గా పనిచేశారు. వీరికి పరమాచార్య వారితో బాగా పరిచయం వుంది. (మా తాత గారు బచ్చు లక్ష్మీ నరసింహ స్వామి, బచ్చు జగన్నాథ్ దాస్ గారు వరసకి అన్నదమ్ములు. వీరి ఇద్దరి భార్యలు స్వయానా అక్కచెల్లెళ్ళు). పరమాచార్య వారితో జరిగిన ఈ సంఘటనని మా బాబాయి గారు నాతో స్వయంగా ఒకసారి చెప్పారు. చిత్రం ఏమిటి అంటే మా బాబాయి గారు తాను ఫలానా అని పరమాచార్య వారికి చెప్పలేదు సరికదా బహుశా వారిని దర్శనం చేసుకోవటం అది తొలిసారి!

పరమాచార్య సంస్కృతం, ఆంగ్లం, ఫ్రెంచ్, స్వీడిష్ భాషలతో పాటు దాదాపు మరో పన్నెండు భారతీయ భాషలలో ప్రావీణ్యం కలవారు. ఆది శంకరుల తరువాత దేశవ్యాప్తంగా నలుదిశలా పలుమార్లు కాలినడకన పర్యటించిన మహనీయులు కంచి పరమాచార్య. కంచి కామకోటి పీఠం వారి ఆధ్వర్యంలో అనేక విద్యాలయాలు, కళాశాలలు, దేవాలయాలు, వైద్యశాలలు దేశ వ్యాప్తంగా నడుపబడుతున్నాయి. ఇతర మతాల ప్రభావాన్ని తట్టుకుని, కొన్ని వందల ఏళ్ల విదేశీయుల దండయాత్రలని, వారి పాలనని తట్టుకుని యావత్ప్రపంచంలోనే ప్రాచీనమైన సనాతన ధర్మం మన భారతదేశంలో ఇప్పటికీ పునాదులతో పటిష్టంగా వుందంటే దానికి ఎనిమిదవ శతాబ్దంలో ఆది శంకరులు ఇరవైయవ శతాబ్దంలో కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి ఇంకా మరెందరో మహాపురుషులు కీలక పాత్రని పోషించారనటంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు.

– బి.యన్.వి. పార్థసారధి

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

భూమిపై పరమాత్మ స్వరూపము-
జిల్లెళ్ళమూడి అమ్మ

సర్వ బ్రహ్మాండాలలో వ్యాపించి వున్న సత్‌చిత్ స్వరూపము, పరమ శుద్ధ చైతన్యము మానవ రూపము దాల్చి, కరుణతో మానవులను దగ్గరకు తీసుకుంటే ఏ రూపములో వస్తుంది?

'అమ్మ' రూపములో వస్తుంది. మానవాళినందరిని బిడ్డలుగా దగ్గరకు తీసుకొని వారి కర్మలను తీసివేసి వారిని తనలో కలుపుకుంటుంది. ఆ శుద్ధ పరబ్రహ్మ స్వరూపమైన కరుణా వాత్సల్య మూర్తియే 'జిల్లెళ్ళమూడి అమ్మ'', 'విశ్వజనని'. అలా రూపు దాల్చిన అమ్మకు వందనము. 'శ్రీమాత్రే నమః'.

గుంటూరు జిల్లా పొన్నూరు మండలము మన్నవలో మన్నవ సీతాపతిశర్మ, రంగమ్మ దంపతులకు 1923లో అమ్మ 'అనసూయమ్మ'గా జన్మించింది. అమ్మ పుట్టిన నాటి నుండి కూడా దైవత్వము చూపుతూ వుండేది. అమ్మకు జన్మనిచ్చిన మాతృమూర్తి అమ్మకు మూడు సంవత్సరములు వున్నపుడు మరణించినది. అందరూ ఏడుస్తుంటే అమ్మ మాత్రం ' దేవుడి నుంచి వచ్చినది దేవుని వద్దకు వెళ్ళింది' అన్నదిట.

అమ్మకు 5 సంవత్సరముల వయస్సులో అమ్మ మెడలో పులిగోరు గొలుసు తస్కరించాలన్న ప్రయత్నం చేసిన పోలిసు మస్తానుకు అమ్మే స్వయంగా గొలుసు తీసి ఇస్తుంది. మస్తాను అమ్మ భక్తుడయ్యాడు.

అమ్మ చిన్నతనము నుంచే ఆసనాలు వెయ్యటము ముద్రలు పట్టటము చేస్తుండేది. ఆమె తాతగారు మరిడయ్య ఆమె చేసే ముద్రలు చూచి ఆమె తన గురువు రత్నమ్మ ఆ రూపములో వచ్చినదని సంతోషపడ్డారుట. అమ్మకు ఐదు సంవత్సరాల వయస్సులో మౌనస్వామి చీరాలలో బస చేశారని అమ్మ తాతయ్య అమ్మను తీసుకువెళ్ళారు. అమ్మ మౌనస్వామిని మరునాడు ఒంటరిగా కలుసుకుంటుంది. మౌనస్వామికి అమ్మకు కొంత సంభాషణ నడుస్తుంది. మౌనస్వామి గురువుకిచ్చిన మాట ప్రకారము మౌనముగా వుంటారు. ఆయన కేవలము అమ్మతో మాత్రమే సంభాషించారు. అమ్మ ఆయన సాగించిన తత్త్వ సంభాషణతో మౌనస్వామి అమ్మను 'అమ్మా నీవెవరు?' అని అడుగుతారు. అమ్మ సమాధానము చెప్పక వచ్చేస్తుంది.

అమ్మ వివాహము అమ్మ పదమూడవ ఏట మేనబావ బ్రహ్మాండము నాగేశ్వరరావుతో జరిగింది. ఆయన జిల్లెళ్ళమూడికి కరణం. అమ్మ వివాహానంతరము జిల్లెళ్ళమూడి వచ్చి అక్కడే వుండిపోయింది. అమ్మ పాద స్పర్శతో జిల్లెళ్ళమూడి పుణ్య క్షేత్ర మయ్యింది.

కుర్తాళం ప్రస్తుత పీఠాధిపతులు శ్రీ సిద్ధేంద్రభారతీస్వామి వారు పొత్తురూ వెంకటేశ్వరరావు గారు, కృష్ణభిక్షు అన్న మిత్రునితో కలిసి జిల్లెళ్ళమూడి వెడతారు. అమ్మ ఎంతో ఆదరముగా వుంటుంది వారితో. శ్రీ పొత్తూరి వారికి దైవము మీద అప్పటికి నమ్మకము వుండదు. ఆయన అమ్మను గమనించటానికి వెడతారు. వారితో పాటూ కొందరు పండితులు కూడా వస్తారు. వచ్చిన పండితులలో ఒకరు అమ్మను బ్రహ్మం గురించి ప్రశ్నిస్తాడు. అమ్మ సమాధానమివ్వక మాటలు కొనసాగిస్తూ వుంటుంది. ఇంతలో ఎవరో సంస్కృత గంధ్రమును ఒకదాన్ని ప్రచురించామని, మొదటి ప్రతి అమ్మకు కానుకగా సమర్పించటానికి వస్తారు. అమ్మ ఆ గ్రంధాన్ని అటు ఇటు త్రిప్పి ప్రసాదరాయ కులపతిగారికి ఇచ్చి 'ఇది చదువు నాన్నా' అంటుంది. ఆ పండితుడు అడిగిన ప్రశ్నకు వారు చదివినది సమాధానమవుతుంది. అందరూ అమ్మ సర్వజ్ఞతకు అచ్చెరువొందుతారు. అలాగే మరో ప్రశ్నకు ఒక ఇంగ్లీష్' పుస్తకము చదివిస్తుంది అమ్మ. వారికి అది చక్కటి సమాధానము. అమ్మకు తెలియని భాషకాని, విషయము కానీ వున్నవా?

అమ్మ వద్దకు వచ్చిన కృష్ణబిక్షు గుంటూరు ఉద్యోగరిత్యా వచ్చినవారు. పూర్వము ఆయన అరుణాచలములో

రమణులకు సన్నిహితంగా మెలిగారు. పరమాచార్యులను కూడా సేవించారు. ఆయన 'రమణ లీల' అన్న గ్రంధకర్త. ఆయన గుంటూరు వచ్చి అమ్మను దర్శించి, మిత్రులను కూడా తీసుకువెళ్ళేవారు. గుంటూరులో రాజధ్యానమనే ప్రక్రియలో ఆయనకు మూడవకన్ను (థర్డ్ ఐ)జ్ఞానము కలిగింది. ఆ జ్ఞానము వలన అనుకున్నవి తెలిసేవి. అలా ఆయమ అమ్మ గురించి తెలుసుకునే ప్రయత్నంచేస్తే, అమ్మ సాక్షాత్ జగన్మాతగా గోచరమయినది. అమ్మ బ్రహ్మాండాలలో వున్న పరమ శుద్ధ చైతన్యమేనని తెలుసుకొని అచ్చెరువొందారు.

తమ గతి ఏమిటని అడిగిన వారికి 'సుగతే' అని సమాధానము చెప్పేది అమ్మ. 'ధ్యాసే ధ్యాన'మని బోధించింది అమ్మ. అమ్మ పశుపక్షుల మీద, సర్వ ప్రాణుల మీద వాత్సల్య ప్రేమను కనపరిచేది. ఆమె ప్రేమకు సర్వులూ ఒక్కటే. అందరిలోని జీవిని చూచేది అమ్మ. ఆమె కరుణ సర్వ జీవులమీద సమానముగా వుండేది.

ఎవరు వచ్చినా ముందు 'అన్నము తిన్నావా నాన్నా' అని పలకరించేది అమ్మ. జడమైన బ్రహ్మము గురించి అలతి పదాలలో చెప్పి, పండిత పామరులనూ ఒకేలా మోక్షమిచ్చి వారిని తనలో కలుపుకోవటానికే అమ్మ ఈ భూమి మీద అవతరించినది. అమ్మ మనలా పనులు చేసినా, వాటిలో అమ్మ దైవత్వము ప్రకటితమవుతూనే వుండేది. అమ్మ తిరగలితో వడ్లు త్రిప్పితే, ఆమె సువాసన ఆ తిరగలికి వుండి వారం రోజుల పాటు మురిపించేదిట.

ఒక భక్తుడు కొందరు దుష్కర్మలు చేస్తున్నారని వారిచేత సత్కర్మలను చెయ్యించమని వేడుకుంటాడు. అమ్మ తనకు ఏదీ దుష్కర్మలా కనపడలేదని చెబుతుంది. మరొక భక్తుడు వచ్చి 'అమ్మా! ధ్యానములో వుంటే ఏవో రూపాలు, ఏకాగ్రత కుదరటము లేదని' మొరపెట్టుకుంటాడు. అమ్మ అతనితో 'బాధపడకు నాన్నా! అన్ని రూపాలూ ఆ పరాత్పరుడివే! నీకు తెలిసిన రూపే ఎందుకు? అన్ని రూపాలు ఆయనవే అనుకో. ధ్యానము కుదురుతుంది' అని చెబుతుంది అమ్మ.

ఒకనాడు ఒక స్త్రీ వచ్చి 'అమ్మా! నాకు మంత్రం చెప్పు మననము చేసుకుంటా' అని బ్రతిమిలాడుతుంది. అమ్మ మంత్రమేమీ లేదన్నా ఆమె వదలదు. అమ్మ కబుర్లు చెబుతూ 'ఎంత మంది పిల్లలు. పెళ్ళిళ్ళు అయ్యాయా ? ' అని అడుగుతుంది. భక్తురాలు సమాధానము చెబుతుంది. 'కూతురుకీ, కోడలుకు తేడా చూపకు, కొడుకుకూ, అల్లుడికీ తేడా చూపకు. అదే అద్వైతము' అంటుంది అమ్మ. అద్వైతము గురించి ఇంత సాదాసీదాగా అమ్మే చెప్పగలదేమో.

'నిగ్రహము వుండటము కోసమే విగ్రహము' అంటుంది అమ్మ. వ్రతాలు,నోములు అన్నీ కూడా అంతటా పరమాత్మను చూడటానికని చెబుతుంది అమ్మ.

మంత్రమంటే అక్షరాలు కూర్చటము కాదు, మననమే మంత్రం అంటుంది

మానవతను పరిమళించే మతం కావాలి! మతాలను పెంచే మానవతా కాలుష్యం నశించాలి!

ప్రపంచంలో పెరుగుతున్న ప్రకృతి కాలుష్యం కన్నా, మత మౌఢ్యాల కారణంగా పెరుగుతున్న మానవతా కాలుష్యం జనజీవన చైతన్యాన్ని హరింప చేస్తున్నది. భూగర్భజలాలు అడుగంటుతున్నట్టు గానే మానవ అంతరగర్భాల్లో వున్న ప్రేమ, వాత్సల్యం, సహజీవనం అనే త్రిమార్గ దర్శకమైన శాంతి సోపాన సూత్రాలు నశిస్తున్నాయ్.

'సమానత' యనే పేరుతో రాజకీయ కాలుష్య ప్రేరకులు ప్రేరేపిస్తున్న ద్వేష విద్వేష, రాగద్వేషాలను విజ్ఞుడూ ప్రాజ్ఞుడైన మానవుడు అడ్డుకోవాలి. మానవతను చిగురింపచేయడానికి ప్రతీ మానవుడూ కృషి చేయాలి. పొరుగు మానవుణ్ణి ప్రేమించడంతో యీ ఉద్యమానికి ఊపిరి పోయాలి. అందరి ఆత్మలూ శాంతి దాయకమై ప్రశాంత వాతావరణాన్ని సృష్టిస్తేనే సత్ఫలితాల్ని సాధించి, ప్రతీ ఒక్కరూ శాంతిసుఖాల్ని పొందకలుగుతారనేడి భావనను మతాచార్యులూ, విద్యా వంతులూ, ప్రతీ మానవుడిలోనూ కల్పించాలి. ఇందుకు ప్రభుత్వాల నుంచిగానీ, రాజకీయలనాయకుల నుంచిగానీ ప్రయత్నం రాదు. ముందు ముందుగా ఇంట్లో వుండే తల్లిదండ్రులూ, విద్యాలయాల్లోని గురువులూ, ఆరాధనాలయాల్లోని ఆచార్యులూ నడముకట్టినవాడే సత్ఫలితాలను కల్గిస్తుంది.

పాశ్చాత్యులు మనసుంచి ఇప్పటి ప్రజాస్వామ్య పక్షాల నాయకుల వఱకూ 'వేర్పాటు' విధానాలకీ ఆద్యులై ఆజ్యం పోస్తున్నారుగానీ, శాంతికీ, సమైక్యతకూ నాందీప్రస్తావనం చేయడంలేదు.

శరీర నిర్మాణం అవయవాల్లోనే లేని సమానత జనంలో జనజీవనంలో ఎక్కడనుంచి వస్తుంది? చేతికున్న ఐదు వేళ్లూ ఒకే పరిణామంలో, ఒకే నిడివిలో ఉంటే, ఏదైనా సాధించ వీలువుతుందా? పొడుగూ పొట్టీ, లావూ సన్నం ఉండే పరిమాణంలోనే అవి కదులాడుతూ సమైక్యమై అనేక కార్యాలను చేయకల్గు తున్నాయి. ఆ కార్యాలు మంచివీ కావచ్చు, చెడువైనా కావచ్చు, కానీ అవి ఆ పొట్టీ పొడుగూ, సన్నం లావూ వేళ్లద్వారానే జరుగుతున్నాయి. భూమి కూడా ఎత్తుపల్లాలలో నుండడం వల్లనే నదీజలములు ప్రవహించి, భూమిని సారవంతం చేయగలుగుతున్నాయ్, జీవరాశుల్ని జీవింపచేయకలుగుతున్నాయి.

ప్రకృతిలోని మెట్టపల్లాలు, శరీర నిర్మాణంలోని హెచ్చుతగ్గులూ, జీవితంలో ఎదురయ్యే సుఖదుఃఖాలు యివన్నీ మానవుని సాంఘిక, సామాజిక జీవనానికి దర్పణాలుగానూ నిఘంటువులుగానూ తీసుకోవలసినవే! ప్రతీదాన్నీ రాజకీయం చేస్తున్న మానవుడు వీటిని విజ్ఞతా దృష్టితో పరిశీలించడం లేదు సరికదా భగవంతుడిచ్చిన వనరులను, సంపదలను కక్షలతో, కార్చిచ్చులతో, పరస్పర వర్గ పోరాటములతో నాశనం చేస్తున్నాడు.

ఎన్నో సంవత్సరాల చరిత్ర, వేద సంస్కృతీ గల భారతదేశంలో ఈనాటి పౌరులను అధికార అనధికారులు తప్పుత్రోవను పట్టిస్తున్నారు. భారతదేశం వంటి చరిత్ర కలిగిన దేశం, ప్రజాస్వామ్యం వంటి పౌర సౌమ్యములు ప్రపంచంలో ఎక్కడనూ కానరావు, అన్ని మతాలవారి వారికీ యిక్కడ వున్న ప్రజాస్వామ్య సమహక్కులు మరియే యితర దేశాల్లోనూ లేవు. కానీ అన్యమతాలవారు యీ దేశానికి వలసవచ్చి, మతమంటూ లేని యీ భారతదేశంలో మతాలను కల్పించి సనాతన ధర్మంలో మట్టిని పోయడం, సెక్యులరిజమ్ అంటూ క్రొత్త వ్యాఖ్యానములను చెప్పడం వింతగా వుంది.

సనాతన ధర్మంలోనే సెక్యులరిజమ్ ఉంది. ఉన్నదానిని లేనట్టు, గోరంతలు కొండంతలు చేసి, మానవతలో కాలుష్యాన్ని పెంపొందింపచేస్తున్నారు. మానవతను పరిమళించే మన మతాన్నీ పెంచి పెద్ద చేసుకోమనీ, ప్రముఖాంధ్ర కోరుతూంది. ఇంటివద్ద తల్లిదండ్రులు తమ పిల్లలకు చిరువయసు నుంచీ శిక్షణ ఇస్తుంటే భావిభారత పౌరులు కాబోయే పిల్లలు నీతి తప్పి మసలడానికి అవకాశం కలుగదు. అటు తదుపరి పాఠశాలల విద్యావిధానం, గురువుల బోధన యిందుకు తోడ్పడితే, మంచి పౌరులుగా తయారయ్యే అవకాశం, భారత భూమిని బంగారంగా మార్చే అవకాశమూ ఉంటుంది. ●

అమ్మ. గాయత్రి అన్నది ఎవ్వరూ వినకుండా కాదు, ఏ చప్పుడూ లేకుండా ప్రశాంతముగా వినమని వివరించింది అమ్మ. 'తృప్తినీ, శాంతినీ, హాయినీ ఇచ్చి సందేహనివృత్తి చెయ్యగలిగింది. ఏదయినా, సందేశమే మంత్రం. మననమే మంత్రం'అని చెప్పేది అమ్మ.

ఒకనాడు ఒకరు అమ్మను సాధన ఎలా చెయ్యాలని అడిగితే, 'వచ్చినవారికి భోజన సదుపాయాలు చూడటమే సాధన' అని చెప్పేది అమ్మ. అలానే చెయ్యమంది. కాని మరురోజు మూడు గంటలకు వచ్చిన భక్తులను భోజనము గురించి అడగడు మేనెజరు. అమ్మ దర్శనానికి తీసుకుపోతాడు. అమ్మ 'భోజనము గురించి అడిగావా నాన్నా?' అంటే 'మూడు గంటలకు వచ్చారుగా, తిని వచ్చి వుంటారు'అంటాడతను. అమ్మ వారిని 'భోజనము చేశారా నాన్నా?' అని అడుగుతుంది. లేదంటారు వచ్చిన భక్తులు. వారిని తిని రమ్మని పంపుతుంది అమ్మ. మేనెజరు తప్పు తెలుసుకొని ఆనాటి నుంచి భక్తులకు భోజనం విషయములో శ్రద్ధ వహిస్తాడు.

చీరాల నుంచి ఇద్దరు భక్తులు వారి ఇంటి చెట్టు కొబ్బరికాయలు, ఒక మల్లెచెండు తీసుకొని నడిచి వెడతారు. వారు అమ్మ సన్నిధి చేరే సరికే అక్కడ పెద్ద ఉత్సవము జరుగుతూ వుంటుంది. అమ్మకు గజమాల వేసి వుంటారు. వివిధ రకాల స్వీట్లు నైవేద్యంగా వుంటాయి. అమ్మ కళ్ళు మూసుకు వుంటుంది. ముద్రలు పెడుతూ వుంటుంది. ఈ చీరాల భక్తులు నెమ్మదిగా ఎవ్వరూ చూడకుండా వారు తెచ్చిన కొబ్బరికాయల సంచి అమ్మ వెనకగా పెట్టి వస్తారు. భోజనశాలలో భోజనము చేసి వస్తుంటే అమ్మ వాళ్ళని పలకరిస్తుంది. 'మీరు నాకోసమేదో తెచ్చారని చెప్పారని' అక్కడ లేని వారి పేరు చెబుతుంది. అతను వెళ్ళి సంచి చూస్తే మాల ఎండిపోయి వుంటుంది. మాల పడవేసి కొబ్బరికాయలు తెస్తాడాభక్తుడు. కొట్టి ఇవ్వమని అడుగుతుంది అమ్మ. ఆ కొబ్బరి ఎంతో ఇష్టంగా తింటూ దీనితో ఇంకోటేదో వుండాలని అడుగుతుంది. మాల ఎండిపొయ్యిందని చెబుతారు.

అమ్మ అంత నిరాడంబర ప్రేమస్వరూపిణి. భక్తులను సర్వులనూ ఆదరించిన తల్లి.

అమ్మను ఎవరన్నా పేపరు మీద ఏదైనా రాసి ఇవ్వమంటే 'అం ఆ' అని రాసేవారు.

అవి బీజక్షరాలని కుర్తాళం స్వామి చెప్పారు. 'ఆ' అంటే అడ్డులేనిది. 'అం' అంటే అంతులేనిది. 'అందరికీ ఆధారమైనది' అని. అంటే అమ్మే కదా!!

అమ్మ మాటలలో 'నేను నేనైన నేను' అనేది. అంటే అద్వైతము. అంతటా అమ్మే! అమ్మే అందరిలో వున్నదని కదూ దీనికి అర్థము.

అమ్మ తారక నామము ఒక మహ్మదీయ భక్తుడు కూర్చాడు. 'జయహో మాతా, జయ అనసూయ రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి' ఈ నామము మూడు ముఖ్య నాడులకు గుర్తు. మూడు గ్రంధులకు గుర్తు. త్రిమూర్తులకు గుర్తు.

'అన్నపూర్ణేశ్వరాలయము' కట్టించింది అమ్మ. వచ్చిన వారు ఏ వేళ అయినా అక్కడ భోజనము దొరుకుతుంది. ఆరోజు నుంచి నేటి వరకూ నిరాటంకముగా అన్నదానము సాగుతోంది. 1985 లో అమ్మ తన భౌతికదేహము వదిలి అనసూయాలయం ప్రవేశము చేసింది.

అక్కడ నేటికీ అన్నదానాలు, అమ్మ పేరున జరుగుతూనే వున్నాయి.

అమ్మ మాతృశ్రీ కాలేజీ, ఆసుపత్రి కూడా నెలకొల్పింది. జిల్లెళ్ళమూడి కూడా కాశీ రామేశ్వరములు బోలిన పుణ్యక్షేత్రము.

అమ్మ భక్తులు చెయ్యవలసినది అమ్మ మాటలలో 'పది మందికి భోజనం పెట్టండి నాన్నా'. అదే అమ్మ ఆచరించినది, భోదించినది. అమ్మ ప్రేమను వాత్సల్యానీ కలిపి ప్రసాదముగా పంచింది. ఆ ప్రసాదము స్వీకరించిన పుణ్యమూర్తులు అమ్మ చెప్పినట్లుగా అది పది మందికి పంచటము చేస్తున్నారు.

"జయహో మాతా, జయ అనసూయ రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి'

– ప్రణాములతో

సంధ్యా యల్లాప్రగడ

సరస్వతీ మహాల్ - సారస్వత సేవ

- రావులపర్తి భద్రిరాజు

రచయిత శ్రీ రావులపర్తి భద్రిరాజు చక్కటి భావాలు గల మధుర గేయ కవి. 'ఏడుకొండల స్వామి ఎక్కడున్నావయ్యా' అనే ఘంటసాల పాడిన గేయానికి మధురాక్షతలు కూర్చిన మహా వ్యక్తి. సుమధురగేయ రచయితలు కరువైన తెలుగు సినిమా పరిశ్రమ వీరిని ప్రోత్సహించవచ్చు.

దక్షిణ భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలో తంజావూరు పట్టణం, చరిత్ర ప్రసిద్ధమైనది. ఇది పురాతన వైభవం కల గొప్ప పుణ్యక్షేత్రం, తంజావూరు పేరు చెప్పగానే, అందరి దృష్టినీ ఆకర్షించేది 'సరస్వతీ మహాల్' గ్రంథాలయం. ఇది ఒక లలితా కళ నిలయం!

తంజావూరుకి ఆ పేరు ఎలా వచ్చిందో, తెలిపే పౌరాణిక ఆధారం కూడా వుంది. పూర్వం దీని పేరు అలకాపురి. కుబేరుని శివుని కోసం, అలకాపురి నిర్మించినట్టు, పురాణాల్లో తెలుస్తుంది. ఇక్కడ పరాశరముని తపస్సు చేసినాడు. ఆ మునికి తంజ. తారక, దండక అనే ముగ్గురు రాక్షసులు తపోభంగం కలిగించారట. ఆ పరాశరుడు విష్ణువుకీ, దుర్గాదేవికీ, తనకొచ్చిన కష్టం నివేదించుకున్నాడు.

అప్పుడు విష్ణువు తారకునీ, దండకునీ; దుర్గాదేవి తంజన్నీ సంహరించారు. మరణ సమయంలో, తంజ రాక్షసుడు, ఆ క్షేత్రం తన పేరుతో వర్ధిల్లాలని, దుర్గని కోరుకుంటున్నాడు. దుర్గాదేవి అతనికా వరం ప్రసాదించింది. అప్పటినుంచీ అలకాపురి పేరు తంజపురి, తంజావూరుగా, వ్యవహరించబడుతున్నది.

ఈ ప్రాంతం, పూర్వం చోళరాజుల పరిపాలనలో వుండేదని, చరిత్రకారులు చెబుతారు. ఇక్కడ మొదటి రాజరాజచోళుడు, దేశంలో అతి పెద్దదైన, రాజరాజేశ్వరాలయం నిర్మించినాడు. ఆలయ గోపుర ప్రాకారాలన్నీ, తెల్లని గ్రానైట్ శిలలతో నిర్మించినాడు. ఆలయ గోపుర ప్రాకారాలన్నీ, తెల్లని గ్రానైట్ శిలలతో నిర్మించబడినవి. ఈ రాజ రాజేశ్వరాలయాన్ని, బృహదీశ్వరాలయం అని కూడా అంటారు. ఇంత పెద్ద శివలింగం దేశంలో మరెక్కడా లేదు. అమ్మవారి పేరు పెరియనాయకి. ఆలయ నిర్మాణానికి, ఆరు సంవత్సరాలు పట్టిందనీ, క్రీ.శ. 1009 సం॥లో పూర్తయిందనీ, రాజరాజచోళుడు ఆలయానికి వెలలేని ఆస్తులిచ్చి ఉత్సవాలు జరిపించినాడనీ, చరిత్ర వల్ల తెలుస్తున్నది.

సుప్రసిద్ధ వాగ్గేయకారుడు, త్యాగరాజు పుట్టి పెరిగినది ఈ తంజావూరులోనే. ఇక్కడికి పది కిలోమీటర్లలో, తిరువయ్యారులో త్యాగరాజు స్థిరపడి, ఎన్నో రామకీర్తనలు రచించి సిద్ధి పొందినాడు. కావేరీనది ఒడ్డున, త్యాగరాజు సమాధి వద్ద, నేటికీ దేశంలోని సంగీత విద్వాంసులంతా, త్యాగ బ్రహ్మోత్సవాలు జరుపుతున్నారు.

తంజావూరు ప్రాంతం, క్రీ.శ. 9 నుంచి 11 శతాబ్ది వరకూ, చోళరాజుల పాలనలో వుండేది. మొదటి రాజేంద్రచోళుడు తన రాజధానిని, గంగైకొండ చోళపురానికి మార్చుకున్న పిమ్మట, తంజావూరు ప్రాముఖ్యం తగ్గింది. అప్పుడు తంజావూరు సందర్శించిన, అల్బిరూనీ అనే అరబ్ మేధావి, తంజావూరు పతానవస్థలో వుందని పేర్కొన్నాడు.

పదమూడో శతాబ్ది నుంచి, పాండ్యరాజుల పాలనలో, తంజావూరు వైభవం తిరిగి సంతరించుకుంది. తరువాత 1643 వరకూ, విజయనగర నాయక రాజుల పరిపాలన జరిగింది. నాయక రాజుల పిమ్మట, 1866లో తంజావూరులో, ఏ కోజీభోంస్లేతో, మహారాష్ట్రుల పాలన ప్రారంభమైంది.

వెయ్యి సంవత్సరాల కాలంలో, తంజావూరు కళలకూ, సంస్కృతికీ, సాహిత్యానికీ ప్రసిద్ధి పొందినది. చోళరాజులు ఉన్నతమైన దేవాలయాలూ, అసమాన శిల్పాలూ చిత్రకళలనూ రూపొందించారు. తంజావూరు చిత్రాలు ప్రపంచ ప్రసిద్ధి పొందాయి.

ఇక నాయక రాజుల పరిపాలనలో, తెలుగుతో సహ వివిధ భాషల సాహిత్యం, నాటకం, సంగీతం, ఇతర లలిత కళలన్నీ వెలుగులోకి వచ్చాయి. శాస్త్రీయ గ్రంథాలెన్నో వెలువడ్డాయి. పురాతన తాళపత్ర గ్రంథాలు చాలా సేకరించబడ్డాయి. నాయక రాజులు వ్యక్తిగతంగా, తమ ఉపయోగానికి, రాజభవనంలో 'సరస్వతీ మహాల్' అనే ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నాయక రాజుల పిమ్మట వచ్చిన మరాఠీ రాజులు ఈ గ్రంథాలయాన్ని బహుముఖంగా విస్తరింపజేశారు.

మరాఠీ రాజుల్లో రెండవ సెర్ఫోజీ మహారాజు సహజంగా, కవి పండితుడు మేధావి కావడం వల్ల, సరస్వతీ హాల్ గ్రంథాలయం విశేషంగా వర్ధిల్లినది. సెర్ఫోజీ మహారాజు, ప్రత్యేక శ్రద్ధతో, కాశీ వెళ్లి, అక్కడ పండితులను నియమించి, వారి ద్వారా సంస్కృతం, తదితర భాషల్లోనితాళపత్ర గ్రంథాల్ని, ధనమిచ్చి కొని, వాటిని సరస్వతీ మహాల్‌కి చేర్చినాడు.

కాలక్రమంలో, ఈ గ్రంథాలయానికి "తంజావూరు మహారాజా సెర్ఫోజీ సరస్వతీ మహాల్ లైబ్రరీ" అనే పేరు పెట్టబడినది. సెర్ఫోజీని, ఒక మహాపురుషునిగా ప్రపంచం గుర్తించింది.

చివరి మరాఠీ రాణి వరకూ ఈ గ్రంథాలయం రాజభవనానికి చెంది వుండేది. ఆ రాణి మరణానంతరం, ఈ గ్రంథాలయం, ఆమె ఆస్తులు వివాదాస్పదమైనవి.

ఇంగ్లీషు వారి పాలనలో ఆంధ్ర, తమిళ రాష్ట్రాలు సమిష్టిగా వున్నప్పుడు, దేవాదాయ ధర్మాదాయ శాఖవారు 1918లో ఈ గ్రంథాలయాన్ని, రాణి ఆస్తులనూ, తమ ఏలుబడిలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు సరస్వతీ మహాల్ గ్రంథాలయం,

తమిళనాడు ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాల పర్యవేక్షణలోనికి వచ్చినది. భారత ప్రభుత్వం ఈ గ్రంథాలయాన్ని భారతజాతికి అంకితం చేసినది.

ఈనాడు 'సరస్వతీ మహల్ గ్రంథాలయం'లో అసంఖ్యాకంగా గ్రంథాలు కానవస్తున్నవి. ఇక్కడ మొత్తం 46,695 గ్రంథాలు లెక్కకు వస్తున్నవి, 400 సం॥ల కాలంలోని, కవి పండితుల గ్రంథాలు, సంస్కృత గ్రంథాలు ఇందులో పొందుపరచ బడినవి. సంస్కృత గ్రంథాలు చాలావరకూ, తమిళ గ్రంథలిపి, దేవనాగరి, నంది నాగరి, మోడీ మరాఠీ లిపి, తెలుగు లిపులతో వున్నవి. మలయాళ, కన్నడ, ఒరియా, ఇంగ్లీషు, డేనిష్ ఇంకా విదేశాల గ్రంథాలు కూడా కనిపిస్తాయి. కొన్ని సాహిత్య గ్రంథాలు చిత్రకళా సమన్వితమై వున్నవి.

తాటియాకులపై వ్రాయబడిన గ్రంథాలు : సంస్కృతంలో 21,187; తమిళం 3490; తెలుగు 44; హిందీ 22 వున్నాయి. ఈ గ్రంథాలన్నీ గొప్పవే, ఐతే ఎవరికైనా, తమ మాతృభాషల్లోకి అనువదింపబడినప్పుడే, వీటి ప్రయోజనం తెలుస్తుంది. వీటిలో గ్రంథాలయం వారు ప్రచురించినవి 394 పుస్తకాలు. ఇందులో ప్రచురణకు నోచుకున్న తెలుగు పుస్తకాలు, 19 మాత్రమే కావడం గమనార్హం. ఇవిగాక సంస్కృతంలో 114, తమిళంలో 175 పుస్తకాలు ప్రచురించబడ్డాయి. క్రీ.శ. 7వ శతాబ్దినుంచీ, పల్లవరాజుల చేత కూడా, పురాతన గ్రంథాలు సేకరించబడినట్లు తెలుస్తున్నది.

జాయపగారి 'నృత్యరత్నావళి' గ్రంథం – సంస్కృతం, గ్రంథ లిపి, తెలుగు లిపులలో వున్నది. భీమన్నగారి 'జ్యోతిషనవాంశ' గ్రంథము, సీస మాలిక పద్యాలలో కానవస్తున్నది. శాహరాజు కాలంలో త్యాగరాజు త్యాగేశపదములు రచించినాడు. ఈ త్యాగరాజు, రామకీర్తనలు రచించిన త్యాగరాజు కాడు.

క్రీ.శ. 1684 నుంచి 1712 మధ్యకాలంలో, శహజీ ప్రభువు సరస్వతీ మహల్‌కి సేకరించిన గ్రంథాలు చాలా వున్నవి. నన్నెచోడుని 'కుమార సంభవం'; చేమకూర వెంకట కవి రచించిన 'విజయ విలాసం', 'సారంగధర చరిత్ర' కృష్ణాధ్వరి రచించిన 'నైషధపారిజాతీయము' – ఇది పద్యరచన, ద్వ్యర్థికావ్యం; తెలుగులో ఉత్తమ గ్రంథాలింకా ఎన్నో వున్నవి.

'రఘునాథనాయకాభ్యుదయం', 'రఘునాథాభ్యుదయం' అనే ప్రబంధ యక్షగానములు, 'శ్రీకృష్ణ విలాస యక్షగానము'ను, విజయరాఘవ నాయకరాజు రచించినాడు. శహాజీ 'యక్షగానాలూ', రఘునాథ నాయకుని 'సంగీత సుధ' ప్రసిద్ధమైన గ్రంథాలు.

విజయ రాఘవనాయకుని కొలువులో వుండిన, సుప్రసిద్ధ కవయిత్రి రంగాజమ్మ 'ఉషా పరిణయము'; 'మన్నారుదాస విలాసము' అనే గ్రంథాలు రచించినది. విజయరాఘవుని కుమారుడు, మన్నారు దేవుడు, 'హేమాబ్జ నాయిక స్వయంవరం' అనే గ్రంథం రచించినాడు. ఇవి భాషలోనూ, భావంలోనూ, రసగర్భితమై పండిత పామరుల, మన్ననలందుకున్న గ్రంథాలు.

కట్టా వరదరాజు రచించిన – 'శ్రీరామాయణము' ద్విపదలో పూర్తిగా నాలుగు సంపుటాల్లో ప్రచురింపబడినది. ఈ వరదరాజు, కావేరీ నదికి ఆనకట్ట నిర్మించడంవల్ల ఇంటి పేరు కట్టా అని వ్యవహరిస్తున్నారు. మడికి సింగనార్యుడు భాగవతంలోని 'దశమస్కంధం' మాత్రం ద్విపదలో రచించినాడు. ఇది తెలుగువారికి పారాయణ గ్రంథమైన, కవిపండితుల ప్రశంసనందుకున్న గ్రంథం. ఈ రచయిత సింగన తూర్పు గోదావరి జిల్లాలోని మడికి గ్రామస్తుడు.

పరమానందతీర్థుని 'వివేకచింతామణి', 'ముక్తికాంత పరిణయం' ప్రసిద్ధమైన గ్రంథాలు, వివేకచింతామణి విశ్వరహస్యాలతో, సకల శాస్త్రాల సారం, ఇమిడి వున్న రచన గ్రంథం. ఇది ఒక విజ్ఞాన సర్వస్వం అని చెప్పాలి. తెలుగువారంతా చదువవలసిన గ్రంథం. పరమానంద తీర్థుడు దత్తాత్రేయ ఉపాసకుడు.

కాచన 'మైరావణచరిత్ర; రామనార్యుని కుశలవోపాఖ్యానం; జక్కరాజు వెంకటరవి 'ఆంధ్ర కామందకము;' పోలూరి గోవిందకవి 'తాళదళశ ప్రాణప్రదీపిక' మొదలైన గ్రంథాలు సరస్వతీ మహల్ వారు లోగడ ప్రచురించినారు. ఆ ప్రతులిప్పుడు దొరకవు. ●

ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత **26** సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

రూ. 251, 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా

ప్రముఖాంధ్ర

64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33. మొబైల్ : 98400 48941

సాహిత్య సాగరుడు సముద్రాల రాఘవాచార్య

మహనీయుల జీవిత చరిత్రలు మహాసాగరము వంటివి. అగస్త్యుని వలే ఔపోసన పట్టటానికి మనం మహర్షులంకాదు. శతవధానం, సంపాదకత్వం, సాహిత్యం అనే మూడు విషయాల మీద ముచ్చటించుకుందాము మన సముద్రాల వేంకట రాఘవాచార్య గురించి. వారి జీవిత చరిత్రను చెప్పటం సూర్యుని ముందు దివిటీ వెలిగించటమే అవుతుంది.

1940 దశకంలో పౌరాణిక చిత్రగీతాలకు, భక్తిగీతాలకు అద్భుతమైన పదబంధాలతో పాటలు, వ్యావహారిక భాషలో మాటలు రాసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన మహనీయుడు సముద్రాల రాఘవాచార్యులు. తెలుగు చలనచిత్ర గేయ సాహిత్యానికి, సంభాషణల రచనకు కావ్యపరిమళం అద్దిన తొలి తరం కవులలో సముద్రాల రాఘవాచార్య అగ్రగణ్యులు.

ఆయన ఆదికవి. కవి కులపతి. రచయితే అంటే ఏదో ఒక పాటో, కథో, మాటలో రాయటం కాదు. "చక్కని, చిక్కని కవిత్వం పదికాలాలపాటు నిలిచిపోయే టట్లు అర్థాన్ని, అంతరార్థాన్ని, పరమార్థాన్ని పొదగగలిగిన వారే సినీకవి. అలానే కవిత్రయంగా సముద్రాల, మల్లాది రామకృష్ణశాస్త్రి, పింగళి నాగేంద్రరావు గారిని చెప్పవచ్చు. అందులో "ఆదికవి" మన సముద్రాల వారు.

తన పదునైన కలంతో "సినీ గీతసుందరి"కి సొబగులద్ది, పైటవేసి అలంకరించిన సాహితీమూర్తి సముద్రాల. 1937 నుంచి 1968 వరకు సముద్రాల జీవితం తెలుగు సినీ చరిత్రలో ముడిపడి వుంది. ఆయన సినీ కళామతల్లి పాలభాగాన తేజోమయ తిలకంగా భాసిల్లిన "గీతాచార్యుడు. సినిమా కథనాన్ని నవనవోన్మేషం చేసిన "మాటసారి". తెలుగు సినీ యుగపురుషులుగా, శక పురుషులుగా కీర్తించే కీ॥శే॥ గూడవల్లి రామబ్రహ్మం, కె.వి.రెడ్డి, బి.యన్.రెడ్డి, నాగయ్య, రామారావు, నాగేశ్వర రావు, భానుమతి, అంజలి వంటి మహనీయుల ఆలోచనలకు ఆకృతినిచ్చిన మూలవిరాట్టు సముద్రాల. ఆయన చలనచిత్ర జగత్తుకు "ఆదికవి", "కవి కులపతి", "సినీ సాగర సముద్రుడు". ఆయన దృక్కోణంలో గృహలక్ష్మి, దేవత, చండీరాణి, సతీసులోచన, సుమతీ, సక్కుబాయి, సుకన్య, పార్వతి, లైలా, అనార్కలి, శకుంతల వంటి ఆదర్శ గృహిణులు, సాహస నారీమణులు, సాధ్వీమ తల్లులు, ప్రేమమూర్తులు కనిపిస్తారు. అలాగే జరదేవుడు, త్యాగయ్య, పోతన, వేమన, రామదాసు, విప్రనారాయణ, కబీరు వంట యోగిపుంగవులు, తత్త్వవేత్తలు, భక్తశిఖామణులు. రాముడు, కృష్ణుడు, బాలాజి, పాండురంగడు, శివుడు వంటి దేవతామూర్తులు వారి గుణగణాలు సముద్రాల రచనలలో అద్భుతంగా గోచరిస్తాయి. చలనచిత్రసీమలో గ్రాంథీకము నుండి వ్యావహారికములో మాటలు, పద్యాలు మార్చి వ్యావహారిక భాషలో పద్యాలు, కీర్తనలు వంటి పాటలు స్థానంలో జానపదశైలిలో పాటలు రాసి ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఆ రోజులలో ఇది విప్లవాత్మక పరిణామం. ఆయన చలనచిత్ర జీవితంలో 1936లో వేల్ పిక్చర్స్ వారి మాయాబజార్ (శశిరేఖా పరిణయం)లో కొన్ని సన్నివేశాలు రాశారు. అలాగే ద్రౌపది వస్త్రాపరహరణంలో కొన్ని సన్నివేశాలు రాశారు. 1937లో హెచ్.వి.బాబు "కనకతార"లో మాటలు, పాటలు, పద్యాలు వ్యావహారిక భాషలో రాశారు. ఆయన మొదటి పాట "దేవుని మహిమా తెలియగా వశమా", 1938 నాటి "గృహలక్ష్మి" నుంచి 1968 నాటి పద్మనాభం చిత్రం శ్రీరామకథ వరకు 1969లో విడుదలైన తారా శశాంకం వరకూ ఆయన జైత్రయాత్ర అప్రతిహతంగా సాగింది. 90-95 చిత్రాలకు రచన చేసి దాదాపుగా 900 పైగా పాటలు రాశారు.

ఇంక సముద్రాల వారి జీవితం క్లుప్తంగా, సముద్రాల వంశీయులు కరీంనగర్ జిల్లా భహేడ్ ప్రాంతంలో "సముద్రాల" అనే ఊరుండేది. వారి పెద్దలు వలస గుంటూరు కృష్ణా జిల్లాలకు వచ్చి నివాసముండి సాహిత్యం, అర్చకత్వం, వ్యవసాయం

మొ॥నవి చేసుకునేవారు. శ్రీరాముడు, కృష్ణుడు, వెంకటేశ్వరుని పూజించేవారు. కృష్ణానదికి ఒకవైపు కృష్ణా జిల్లా మచిలీపట్నం వరకు రెండవవైపు గుంటూరు జిల్లా నుంచి అనేకమంది విద్వణ్మణులు, రచయితలు, సంగీత దర్శకులు, కళాకారులు, సాంకేతిక నిపుణులు చలనచిత్ర పరిశ్రమకు వచ్చారు. అటువంటివారిలో మన సముద్రాల రాఘవాచార్య సుప్రసిద్ధులు.

జననం 10-03-1903. రేపల్లె తాలూకు పెద పులిపర్రులో. 15వ ఏటనుండి ఎక్కువగా సాహిత్య అధ్యయనం, కవితా వ్యాసాంగం మీద దృష్టి. మిత్రులను కూడగట్టుకొని పంటకాలవ గట్లపైన నడుస్తూ అవధాన ప్రక్రియలో తన ధారణశక్తిని పరీక్షించుకునేవారు. అవధానాలు చేసేవారు. శతావధానం చేసేవారు. అవధాన ప్రక్రియకు మూలపురుషులు తిరుపతి వెంకట కవులు, ఆదిభట్ల నారాయణదాసు వీరికి ఆదర్శం. 1918లో రత్నవల్లి గారితో వివాహం. ఇద్దరు కొడుకులు రామానుజాచార్య (జూనియర్), శేషతల్పశాయి. ఇద్దరు కుమార్తెలు కుముదవల్లి తాయారు, మంగతాయారు. 1930లో శతావధానం, తెలుగు భాష ఉపాధ్యాయులుగా, త్రిపురనేని పత్రిక "రైతుపత్రిక"లో సంపాదకత్వం. గూడవల్లి సమదర్శినిలో సంపాదకీయం. 1932 నుంచి "ప్రజామిత్ర" సంపాదకీయం. సాహితీవేత్తలతో చర్చలు, బి.యన్.రెడ్డితో పరిచయం. 1937లో "కనకతార" మొదటి చిత్రం. 1938లో గృహలక్ష్మి. వాహినీ విజయా ఆస్థాన రచయిత. అనేక చిత్రాలకు కథ, మాటలూ, పాటలు రచన. 1948 నుంచి అక్కినేని, 1950 తరువాత రామారావు ఇతర చిత్రపరిశ్రమ పెద్దల చిత్రాలకు రచన. యన్.టి.ఆర్.కు అనేక కథలు రాసి ఇచ్చారు. కొన్ని తెరకెక్కలేదు. మూడు చిత్రాలు నిర్మించారు. మూడు చిత్రాలు దర్శకత్వం వహించారు. వేమన, త్యాగయ్య, పోతన వంటి చిత్రాలలో అద్భుతమైన రచన. ఈ చిత్రాలు కొందరి జీవితాలు మార్చాయి. ఆయనకు ఉబ్బసం వ్యాధి 50వ దశకంలో వచ్చి తగ్గింది. మరల 1967లో ఉబ్బసం వ్యాధి వచ్చి ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. చివరలో చిత్రాలు రాయలేక తన తనయుడు జూనియర్, అనుయాయులు మల్లాది రామకృష్ణ శాస్త్రి, దాసం గోపాలకృష్ణచే కొన్ని చిత్రాలకు

'తెలుగు'లోని 'వెలుగు'దనాన్ని నింపుకుంటూ భారత సమైక్యత సంస్కృతికి తోడ్పడాలి!!

విశాలమైన భావాలుగల మనుష్యులతో, విశాల విస్తీర్ణతగల భూప్రదేశం తెలుగు వారిది. జంబూద్వీప భరతఖండంలో –తెలుగురాజులు – పాలించనదీ, తెలుగు భాషను పలుకనదీ, తెలుగుదనాన్ని వరించినదీ దేశమూ, మనుష్యులూ లేరు. అందుకేతాను కన్నడిగుడైనప్పటికినీ నేను తెలుగు వల్లభుడ–నన్నాడు శ్రీకృష్ణదేవ రాయలు. – అంటూనే తన ఆస్థానంలో ఎనిమిది అష్టదిగ్గజాలైన తెలుగు కవులను పోషిస్తూ, తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించాడు, తెలుగులో తాను గ్రంథరచన చేశాడు. శుద్ధ శ్రోత్రియుడూ, తమిళ భాషా ప్రవీణుడైన శ్రీ అప్పయ్య దీక్షితులు, తెలుగువానిగా తెలుగుదేశంలో పుట్టి, తెలుగును వ్రాయనూ, చదవనూ నేర్వడమెంతో గరిష్టమైన గర్వ గౌరవప్రదం అన్నాడు. సుందర తెలుగులో పాడుదాం, ఆడుదాం అన్నాడు. సుబ్రహ్మణ్య భారతి – ఇటాలియన్ ఆఫ్ ది ఈస్టు – ఇలాఇలా చెప్పుకుని పోతూ వుంటే ఇలాతలంలో తెలుగు కోసం ఒక బృహద్గ్రంథాన్ని తయారుచేయవచ్చు; 366 రోజుల సుదీర్ఘ సంవత్సరాల కాలాన్ని తెలుగు ముచ్చట్లతో గడిపేయవచ్చు. కానీ కాలహరణం కాదు మనకు కావలసింది, కాలం యొక్క విలువ కావాలి, కాలపురుషుని అనుగ్రహం కావాలి.

భారతదేశంలో వైదిక (వేద) సంస్కృతి, ప్రాచీన తెగల సంస్కృతిలో విలీనమై, నాలుగు వేల సంవత్సరాల పైచిలుకు కాలం ఒద్దికగా కుదుటపడింది. ఉత్తర దక్షిణ భారత సాంప్రదాయాలు పూర్వ పశ్చిమ దిక్కుల కౌగిటలో పులకరించి పోయాయి. భాషకన్నా భావానికీ, భావంకన్నా కలుపుగోలుతనానికీ ప్రాధాన్యమిచ్చి, అర్ధనారీశ్వర తత్త్వంలో అఖండ భారతానికి రూపం యిచ్చింది, జంబుద్వీపే, భరతఖండే, భరతవర్షే, మేరువు దిగ్భాగే, దక్షిణ మండలే కావేరీ, కృష్ణా, గోదావరీ ప్రవరలతో సమైక్యతా సంస్కృతీ సాంప్రదాయాలను ప్రోది చేసుకుంది.

శ్రీశైలం నడిబొడ్డుగా భాషాపర్యావరణం సమస్త మానవుల్లోనూ సృజనాత్మక శక్తిని, సామర్థ్యాన్ని గ్రహింపచేయడమే గాకుండా – మానవ అనుభూతికి, చైతన్యానికి కారకమైంది. ఔత్తరాహుడైన ఛత్రపతి శివాజీ శ్రీశైలం సందర్శించి, భవానీ భ్రమరాంబ నుంచి విజయఖడ్గం అనుగ్రహింపబడ్డాడనీ, అర్జునుడు శివునితో పోరి, ఆయన్ను మెప్పించి పాశుపతాస్త్రం పొందినది కూడా దక్షిణ దిగ్భాగమేనని, శ్రీరామచంద్రుని అడుగడుగూ దక్షిణపథంలో ఉందనీ, అతడు ఔత్తరాహుడైనప్పటికినీ, స్నేహం, సఖ్యతా, ధర్మపాలనం దక్షిణాదిలో సాగించాడనీ, తన దృక్కులను సారించిన రామరాజ్యమిదేననీ పురాణపరమైన సత్యం.

భారతీయుల్లో, ముఖ్యంగా ఎక్కువ సంఖ్యాబలం గల తెలుగువారు, అనేక రంగాల్లో భూ, సాగర పరిధుల్ని దాటి వెళ్ళారు. విశ్వంలో తమ ప్రతిభను చూపించారు. అందుకే 'విశ్వ' అనే పదానికి విశ్వసనీయత కల్పించిందీ వసుధైక కుటుంబం – అనే విశ్వ కుటుంబాన్ని యేర్పరచుకున్నదీ తెలుగువారే! తెలుగువారికి సంకుచిత దృష్టీ, సంకుచిత మనస్సు లేదు. వంగకవి రవీంద్రుడు కూడా విశాల విశ్వదృష్టిని అలవరచుకుని, తన సాహితీసంపదను 'విశ్వసాహిత్యం'గా విస్తరింపజేశాడు. అవయవ నిర్మాణంలా అవ్యయమైన యీ ప్రకృతీ సంపదను, భూమిని, ప్రజలను, సంస్కృతినీ ఆకాశమంత ఎత్తుకు లేపి, – భారత భాగ్యవిధాతా–యని సంబోధించా దంటే – అదెంతటి భారతీయ సమైక్యతా దృక్పదం ఉందో తెలుస్తూనే ఉంది. ఆయన సర్వే సర్వత్రా, సర్వప్రదేశములనూ, సర్వప్రజలనూ, సర్వప్రకృతీ సంపదనూ, భాషా సాహిత్య సంపదనూ 'జయహే జయహే జయజయ జయహే' అంటూ శుభప్రద శుభవచనాల్ని స్వస్తివచనాల్లా సుశక్తీ పూర్వక శక్తి వచనాల్లా, పలికాడంటే ఎంతటి సమైక్యతా, సౌజన్యతాపూరిత సంస్కృతీ వికాశం అంతర్లీనమై వుందో గ్రహించండి. తాత్వికుడైన సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారు, తదితర పండిత ప్రకాండులూ గ్రహించి – తెలుగులోని వెలుగుదనాన్ని భారతీయ సమైక్యతా సంస్కృతికి వినియోగించారు. తమ సర్వశక్తుల్లోనూ ధారపోశారు. మీరూ ఆ బాటలోనే నడవండి. తెలుగులోని శీతల వెలుగుదనాన్ని వెదజల్లండి! ●

రాయించారు. దాసం గోపాలకృష్ణ గుత్తా రామినీడు "భక్తపోతన"కు రాశారు. 1968లో పద్మనాభం చిత్రం "శ్రీరామకథ"లో రామాయణ చరితం కథ ఇబ్బంది వస్తే జూనియర్ చేత రాయించి, మనుమరాలితో మాట్లాడి నిద్రిస్తానని మేడపైకి వెళ్ళి పరమపదించారు. ఉబ్బస వ్యాధితో మార్చి 16, 1968న మూడు దశాబ్దాలుగా చలనచిత్రసీమలో ఓ వెలుగు వెలిగిన సాహితీ సూర్యుడు అస్తమించారు.

ఆయన కవితా శైలికి మచ్చుతునకలు ఈ రెండు :

ఆయన యన్.టి.ఆర్.కి. శ్రీకృష్ణపాండవీయం (1966)లో దుర్యోధనునికి సుదీర్ఘ డైలాగులు "పాంచాలీ పంచ భర్తృక నీవా నన్ను పరిహసించునది". అలాగే పాండవవనవాసం (1965)లో యస్.వి.రంగారావుకి సుయోధన పాత్రలో "అస్మదీయ పితృదయాలబ్ధమాత్ర వైభవులై సామంతులైన పాండవులు రాజసూయాధ్వరప్రవర్తకులై, భద్రసింహాసనారూఢులై ఈ రారాజును చూసి పరిహసింతురే... ఈ గదా దండము నిస్సారమా! నిరర్థకమా!! ఆ పై రెండు డైలాగులు సముద్రాల వారి రచనలలో కలికితురాయిలు. సముద్రాల వారు చిన్నప్పుడే సాహిత్యాన్ని మథించి, అవధానాలు చేశారు. అవధాన ప్రక్రియకు ఆద్యులైనారు. జాతీయోద్యమంలో పాల్గొని, జైలుశిక్ష అనుభవించారు. తన పూర్వీకుల ఆస్తులను సమాజానికి ఇచ్చారు. ఆయన రాసిన చిత్రాలు ఎక్కువ శాతం పౌరాణిక, భక్తి రసానికి చెందినవే. రెండుసార్లు వచ్చిన భక్తపోతన (1942, 1966). పల్నాటియుద్ధం (1947, 1966) సముద్రాల రాయటం విశేషం. సముద్రాల తనకు సాహిత్యంలో ఉన్న అనుభవం కొద్ది మూడు చిత్రాలు వినాయకచవితి, భక్త రఘునాథ్, బబ్రువాహన)కూ సాధికారంగా దర్శకత్వం వహించారు. జానపద చిత్రాలకు (బాలరాజు, స్వప్నసుందరి), సాంఘీక చిత్రాలు దేవదాసు, దొంగరాముడు), చారిత్రాత్మక చిత్రాలు (నర్తనశాల, పాండవవనవాసం), సామర్థ్యంతో రచన చేసి, ప్రేక్షకులను మెప్పించగలిగిన ప్రతిభ సముద్రాల వారి సొత్తు. శ్రీరాముని జీవితచరితము భూకైలాస్ (రాముని అవతారం) లవకుశ (శ్రీరాముని చరితము) వాల్మీకిలో (రామాయణ కావ్య సుధ) ఆయన రాసిన శ్రీరామకథలో (రామకథ) అద్భుతంగా ఆవిష్కరించారు. ఆయన రామచరితము పాటలు పది పన్నెండున్నాయి. వేటికవే ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఆయన రామునిపై పాటలు ఎక్కువ రాశారు. భక్తిజీతాలు ఆయన రాసినన్ని ఎవరూ రాయలేదు అంటే అతిశయోక్తి కాదు. ఆయన శ్రీకృష్ణునికి, నారదుడు, రావణుడు మొ॥ పాత్రలకి మూడు నాలుగు చిత్రాలలో వైవిధ్యంగా రాశారు. సముద్రాల బిజీగా రచనా సమయంలో ప్రభుత్వ పురస్కారాలు ప్రవేశపెట్టలేదు. లేకపోతే అనేకమైన బిరుదులు, సత్కారాలు ఆయనకు మణిభూషణాలయ్యేవి.

తదనంతర కాలంలో తెనాలి రామకృష్ణ, లవకుశ, నర్తనశాల, అమరశిల్పి జక్కన్న, చిత్రాలు జాతీయస్థాయిలో ప్రశంసా పత్రాలు పొందాయి. 1962లో సముద్రాల దంపతులకు అభిమానులు ఘనంగా వాణీమహల్లో షష్టిపూర్తి జరిపారు. రామారావు నిర్మించిన శ్రీరామ పట్టాభిషేకం చిత్రానికి సముద్రాల స్క్రిప్ట్ సమకూర్చారు. సముద్రాల రచన చేసిన "వందేమాతరం" చిత్రానికి మైసూర్ మహారాజా ప్రత్యేకంగా చూసి అభినందించారు. స్వర్గసీమ సినిమా వియత్నాంలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. నర్తనశాల జకార్తాలో పాల్గొంది.

సముద్రాల వారి జీవితమనే సాగరంను మథించటం మనకు సాధ్యమా. ఇంకా అనేక విషయాలు గుప్తంగా వుండిపోయాయి. కొన్ని మాత్రమే పొందుపరచాను.

– కొన్ని వ్యాసాలు, పుస్తకాల నుండి సేకరణ

– సుదర్శనాచార్యులు

ఈసురోయని మనుష్యులుంటే దేశమే గతి బాగుపడునోయ్! గురజాడ ప్రశ్నించిన ప్రశ్న ఈనాటికినీ ప్రశ్నగానే ఉంది!

నన్నయ్య భట్టారకుని మహాభారతంతో రాజమహేంద్ర పట్టణం, రాజరాజ నరేంద్రులూ పునీతులైనా, తెలుగుదేశం తెలుగుదనం వెలుగుల్ని నలుమూలలా ప్రసరించి చీకట్లనూ పరిపూర్తిగా తొలగించ లేదు. మసకచీకట్లలోనే విజ్ఞానజ్యోతి కాంతిరేఖల్ని ప్రసరిస్తున్నది. అల ఉత్తరాంధ్రలో ఆనంద గజపతిరాజు అభ్యుదయవాదియై, తెలుగు సాహిత్యంలో సాన్నిహిత్యాన్ని పెంచుకుని కృషి చేస్తూ, ప్రజల్ని మూఢవిశ్వాసాల నుంచీ మేలుకొలపాలనీ ప్రయత్నించాడు. వలసాధిపత్యంలో దిగజారిపోయిన దేశ విజ్ఞానాన్ని శతవిధాలుగా కృషిచేసి పెంచే ప్రయత్నం చేస్తున్న తరుణమిది. గురజాడ అప్పారావు గాఢాంధకారంలోని వేగుచుక్కగా నడుము కట్టాడు. దేశమంటే మట్టికాదు, మనుష్యులన్నాడు. ఆ మనుష్యులు ఈసురోమని ఉంటే దేశమేగతిని బాగుపడుతుందని పాటలద్వారా, చిన్నచిన్న ద్విపదాల ద్వారా, గద్యం ద్వారా, నాటిక నాటకముల ద్వారా హృద్యమంగా చెప్పడం ప్రారంభించాడు. ఒట్టి మాటలు చెప్పవద్దన్నాడు. గట్టిమేల్ తలపెట్టమన్నాడు. అటు బాల్యవివాహాల్లోనూ బాలవితంతువుల వివాహాల సంస్కరణల్లోనూ తలమునకలై వున్న శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు, గ్రాంథిక భాషను ప్రతిఘటిస్తున్న గిడుగు రామమూర్తిపంతులు ఉద్యమాలకు హృద్యమంగా శ్రీ గురజాడ అప్పారావు స్ఫూర్తినిచ్చినట్లయింది. వంద సంవత్సరాల క్రితం ఆయన రాసిన కన్యాశుల్కం నాటకం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ – అంటూ వ్రాసిన గేయ గాథ. ఆయన పుంఖానుపుంఖంగా వ్రాసిన కథలు, (ముఖ్యంగా పెద్దమసీదు కథ) భవిష్యత్తుకు పాతకొత్తల మేలుకలయికయింది, చైతన్యపూర్వకమైన వారసత్వమునకు ప్రతీకమైయింది. నిజమైన దేశభక్తియేదో శ్రీ గురజాడ విశ్లేషించి చెప్పారు. 'సొంత లాభాన్ని కొంత మానుకోమన్నారు'. అంతా మానుకొనే వారుండరని ఆయనకు ఆనాడే తెలుసేమో! దేశానికి కనువిప్పు కావడానికి, సమాజంలో చైతన్యం రావడానికీ, జీవిత సంస్కారానికీ ఆయన కొన్నింటిని సూత్రప్రాయంగా చెప్పారు. ముఖ్యంగా మనుష్యుల మధ్య అవగాహన ప్రధానమని గ్రహించిన వ్యక్తి శ్రీ గురజాడ అప్పారావు. అందుకే ఆయన అందరికీ సులభగ్రాహ్యం అయ్యేట్టు, మనోఫలకంపై నూటికీ నూరుపాళ్లూ హృద్యమంగా ముద్రపడేట్టు కవితల్ని కూర్చారు, ఆయన కవితలు ఆనాటి జాతి జీవన ప్రతీకలు. ●

ఆనాటినుంచీ యీనాటి వరకూ జనబాహుళ్యంలో అచ్చు గుద్దినట్టుండిపోయాయంటే ప్రధాన కారణం ఆయన కవితల్లోని రసావేశమే!

'దేంవుడెక్కడో కొండకోనల
దాగెనంటూ చూస్తవేల–
కన్ను విప్పిన కానపడడో
కలిగి యీడోముక్తినతడు' అన్నాడు.

అలాగే పూర్ణమ్మ గేయ ధారలో –

కొండల నడుమను కోనొకటున్నది
కొలను గట్టునా కోవెల లోపల
వెలసెను బంగరు దుర్గమ్మ–
ఏయేమాసమునందున పూచే

ఆయా పూవులను పూజించీ–అంటూ పూర్ణమ్మ పసితనాన్ని, అమాయకతనూ కళ్ళకు గట్టినట్టు చూపిన మహాకవీ, యుగకర్తా శ్రీ గురజాడ అప్పారావు. రవీంద్ర కవీంద్రుని బాణీ, ఆయన రచనల నిండా పచనం చేసి, పక్వమయిన పూర్ణాహారాన్ని వడ్డించినట్టుగా ఉండడమే ఒక ప్రత్యేకత. "నలుగురు కూచుని నవ్వేవేళల నా పేరొకపరి తలపండీ" అంటూ కరుణరసాన్ని ఆర్ద్రతాభావంతో అభివర్ణించిన తీరు కూడా ఆయనకే చెల్లింది. కరడుగట్టిన మానవ హృదయాలను సహితమూ కరిగించే భావావేశం ఆయనది. హృదయాన్ని కదిలించే ఆ కవితావేశాన్నిప్పుడు పునశ్చరణం, పునస్మరణం చేసుకోవడం తప్ప ఏంవి చేయగలం – అని ప్రశ్నించుకుంటే చాలదు! ఆ మహనీయుని సదాశయాలనూ, ఆధునిక కవితా ప్రతిభనూ అవలోకనం చేసుకుంటూ, ఆ అక్షఱ లక్షల సమన్విత సద్భావాన్ని ఆచరణంలో పెడ్తూ, సన్మార్గపథంలో పయనిద్దాం. కానిచో – ఈసురోమని మనుషులుంటే దేశమేగతిని బాగుపడుతుంది. దేశమంటే మట్టి కాదు కదా, మనుషులం కదా! మనసున్న మనుషులుగా మానవదేహాలయాలను దేవాలయాలుగా తీర్చి దిద్దుతాం, ఆ మహాకవికి జోహార్లర్పిద్దాం. ●

'సంగీతసామ్రాట్' మామిళ్లపల్లి సూర్య బాలసుబ్రహ్మణ్య శర్మగారు

నా చిన్నతనంలో ఒకసారి రాజమహేంద్రవరంలో జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాలలో పాడటానికి వెళ్లాను. ఆరోజు ఉదయం అక్కడికి చేరుకోగానే, ఉత్సవాలలో భాగంగా ఉంఛవృత్తి, నగరసంకీర్తన జరుగుతోందని తెలిసి, హిందూ సమాజం సెంటరుకు చేరుకున్నాను.

భైరవి రాగంలో 'రామ! కోదండరామ! రామ! కళ్యాణ రామ!' అంటూ వీధిలో జనం మధ్యన, త్యాగరాజ వేషధారణలో ఒకపెద్దాయన చిడతలు వేస్తూ పాడుతూ ఉంటే, భక్త్యావేశంతో చుట్టూచేరిన జనం వంత పాడుతున్నారు. క్రమంగా కీర్తనవేగం పెరిగింది. రామభక్తి నరనరానా పాకుతోంది అందరికీ... ఒడలుమరచి, కాల, పైకాలాలలో రామనామాన్ని అంటూ చిన్నగా నాట్యం కూడా ఆరంభించారాయన! జనం బిగ్గరగా తాళాలువేస్తూ మైమరచిపాడుతున్నారు. జారిపోతున్న కళ్లద్దాలను పైతోసుకుంటూ, చేతులురెండూ పైకిలేపి, తాదాత్మ్యతతో ఆయనపాడిన త్యాగయ్య ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అద్భుతమైన రీతిలో ఆ నాదయాత్రసాగింది... ప్రతిఏడూ ఉత్సవాలలో అది ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది!

ఆ గాయకులు ఎవరోకాదు, తెలుగువారికి గర్వకారకులైన 'సంగీతసామ్రాట్' మామిళ్లపల్లి సూర్య బాలసుబ్రహ్మణ్య శర్మగారు. ఆయన పుట్టింది రాజమహేంద్రవరం లోనే 17-9-1929 న. విధివశాత్తూ చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని కోల్పోవటమేకాక, పాక్షికంగా అంధత్వం ప్రాప్తించినా, అకుంఠిత దీక్షతో తనకు ప్రాణప్రదమైన సంగీతాన్ని ఏ ద్వారం వేంకటస్వామినాయుడుగారి శిష్యులైన 'నాదస్వరవిద్వాన్' పైడిస్వామిగారి వద్ద కొనసాగించారాయన. నాదస్వర వాద్యంలో పలికే క్లిష్టతరమైన బిరికీ, రవ్వ సంగతులు అలవోకగా పలికించే వారాయన...

పదేళ్లప్రాయంలో శర్మగారి పాటవిన్న 'హరికథాపితామహులు' ఆదిభట్ల నారాయణదాసుగారు, 'ఎవడురా నీగురువు?' అనిఅడిగితే, 'మాగురువుగారు పైడిస్వామి గారు. తప్పులుంటే నావి. గురువుగారివి కావు' అని తొణుకూబెణుకూ లేకుండా చెప్పిన సమాధానానికి అచ్చెరువొంది, ఆతని గురుభక్తిని మెచ్చుకొని, 'కొన్నాళ్లకు గానకచేరీలలో నీవు అమృతం కురిపిస్తావురా!' అని దీవించారట దాసుగారు.

మరికొన్నాళ్లకు, తిరుపతి వేంకటకవులలో ఒకరైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు, శర్మగారి గానం పిఠాపురంలో విని, హర్షాతిరేకంతో 'ఆంధ్ర బాల గాయకరత్న' బిరుదుతో సత్కరించారు.

మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో తన 13 వఏటనే గ్రేడింగ్ తెచ్చుకున్న విద్వాంసులాయన. బెజవాడ ఆకాశవాణి కేంద్రంలో భక్తిరంజని కార్యక్రమం కోసం ఆయన ఎంతో ఆర్తిగా గానంచేసిన 'శ్రీ లక్ష్మీ నృసింహ కరావలంబ స్తోత్రం' వింటుంటే శ్రోతలకు రోమాంచం కలుగక మానదు.

శర్మగారు గొప్ప సాధకులు. ఎన్నిగంటలైనా తన ప్రౌఢగానంతో కట్టిపడేసే విలక్షణ బాణీ ఆయనది! స్వరకల్పనలో ఆయనవేసే లెక్కలు, చమక్కులు... ప్రక్కవాద్య విద్వాంసుల రెక్కలకు పరీక్షే! ఆయన పాడే దురితకాలం, ఇతరులకు దుర్లభం... గుక్కతిప్పుకోకుండా యాభైఆవర్తాల స్వరకల్పన అనర్గళంగా పాడేవారాయన!

కేరళరాష్ట్రంలో సంగీతాన్ని బాగా ఆదరిస్తారని విని, ఆరాష్ట్రంలో కచేరీలు చేయటం కోసం కొన్ని మళయాళ రచనలూ సాధనచేసి, ఆరాష్ట్రమంతటా విస్తృతంగా తిరిగి, కచేరీలతో మెప్పించి, అక్కడ సంపాదించిన సొమ్ముతో ఇల్లు కట్టుకున్న ధీశాలి ఆయన...

అనేక సన్మానాలను, గండపెండెర సత్కారా లను అందుకున్నారాయన. కేంద్ర ప్రభుత్వ సంగీతనాటక అకాడెమీ అవార్డు గ్రహీత. 'ప్రౌఢగాయక శిఖామణి', 'నాదభగీరథ', 'గానకళా చతురానన', 'స్వరసార్వభౌమ', 'సప్తగిరి విద్వన్మణి' ఇత్యాది బిరుదులెన్నో ఆయనను వరించాయి. మద్రాసులో తెలుగుఅకాడెమీ ఘన సత్కారాన్ని అందుకున్నారు.

స్వర్ణపతకాలెన్నో ఆయన స్వంత మయ్యాయి. పాట్నాలో బీహార్ సంగీత నాటక అకాడెమీ అవార్డును ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి గారి చేతులమీదుగా అందుకున్నారు. 1998లో రాష్ట్రపతి అవార్డు శ్రీ కె.ఆర్. నారాయణన్ గారి ద్వారా అందుకున్నారు.

రేడియో ఉద్యోగినైన నేను, వారి సంగీత సభలెన్నో ప్రక్కన కూర్చొని, వినగలిగాను. తన జీవితంలో చివరిగా ఆయన గానం చేసిన 'అపురూప రాగమంజరి' కార్యక్రమానికి వ్యాఖ్యా తగా నన్ను ఎన్నుకున్నారు ఆయన. ఆనాడు ఎన్నో అపూర్వ రచనలు వారి గళంలో ప్రాణం పోసుకున్నాయి.

రాగం తానం పల్లవులు పాడటంలో వారికి వారే సాటి. సందర్భానుసారం తానే సాహిత్యాన్ని కూర్చుకొని, ఆసువుగా పల్లవిగానం చేసే వారాయన. ప్రాచుర్యంలో లేని 5 వివాది మేళకర్త రాగాలతో ఒక పల్లవిని చేసి, దానిలో నల్లేరుమీద నడకలా త్రికాల స్వరప్రస్థారం చేయటం నేను విన్న ఒక అద్భుతం!..

ఎంతో నిగర్వి, స్నేహశీలి ఆయన. 1981 నుండి 1990 వరకూ తిరుపతిలో టి.టి.డివారి కళాపీఠంలోను, శ్రీ వేంకటేశ్వర సంగీత కళాశాలలోను, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లోను గాత్ర సంగీత విభాగాలలో పనిచేశారు. విద్యార్థులకు ఉన్నత విద్యనందించారు.

పదవీవిరమణానంతరం, శర్మగారు ఒంగోలు పట్టణంలో స్థిరనివాసమేర్పరచు కొన్నారు. నేను1994-96 మధ్య, కడప ఆకాశవాణిలో పనిచేసిన కాలంలో ఎన్నోమార్లు మాఇంట ఆయనకు ఆతిథ్యమిచ్చే అదృష్టం దక్కింది నాకు.

అన్నమయ్య కీర్తనలు అనేకం స్వరపరచారాయన. వాటిలో బహుళ ప్రసిద్ధి చెందిన 'హిందోళ' రాగంలోని 'కొండలలో నెలకొన్న' కీర్తనకు సప్తగిరి సంకీర్తనలలో స్థానం దక్కింది.

శర్మగారు వివిధ దేవతలను స్తుతిస్తూ 12 కృతులను, ఒక తత్వాన్ని, 3 తిల్లానాలను రచించారు. వారి శిష్యులైన 'విద్వాన్' శ్రీ కె.వి.బ్రహ్మానందంగారు వాటిని బెజవాడ ఆకాశవాణిలో భక్తిరంజనిలో ప్రసారార్థం గానంచేశారు.

శర్మగారు రేడియో, దూరదర్శన్లలో సంగీత కార్యక్రమాలను తప్పనిసరిగా ఆస్వాదించేవారు. అలా దూరదర్శన్లో ఒక సంగీత కార్యక్రమం వీక్షిస్తూ వయోభారం చేత, తన 73వ ఏట, 2002 వసంవత్సరం నవంబరు 30వ తేదీ రాత్రి ఇహలోకాన్ని విడిచిపెట్టారు.

తెలుగునాట పుట్టి, తమ సేవలను తెలుగునేలకు అంకితం చేసిన ఎమ్మెస్ బాలసుబ్రహ్మణ్య శర్మగారు తెలుగువారందరికీ ఆరాధ్యులు.

- మొదుముడి సుధాకర్

Beautiful City - Beautiful Hotel

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

అటు నేనే... ఇటు నేనే...

"ఆహా! తిక్క కుదిరింది !" అనుకున్నాను నేను. ఎంచేతనంటే...

అటు...

ప్రతి వేసవి సెలవల ముందు...

'మీ హాలిడే ప్లాన్ ఏంటి?' ఫోన్ చేసి అడిగేది పాష్ పావని.

నాకు తెలుసు. తనకు కావల్సింది నా హాలిడే ప్లాన్ కాదు, తను వెళ్ళిన, వెళ్ళబోయే దేశాల గురించిన ముచ్చట్లు చెప్పుకోడానికి ఓ అవకాశం. ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో తెల్సిన వాడే హీరో అన్నాడుగా మహేష్ బాబు. అందుకే, పావని పంచకల్యాణి ఎక్కే విధంగా...

'ఏంలేదు పావని. కుదిరితే రెండు రోజులు ఏ శ్రీశైలమో, భద్రాచలమో వెళ్ళొస్తాం. అంతే.' అంటాను క్లుప్తంగా.

వెంటనే అవతల ఆనందం తన్నుకొస్తుండగా, యుఎస్ఎ నుంచి యూరప్ దాకా, సౌత్ పోల్ నుంచి నార్త్ పోల్ దాకా, తాము తిరిగిన ప్రదేశాల ముచ్చట్లు ఏకరువు పెట్టేది తను. నేను ఫోన్ స్పీకర్ లో పడేసి, నా పన్లు చేసుకుంటూ, మధ్య మధ్య ఊ కొట్టేదాన్ని. ఈ ముచ్చట అక్కడితో ఆగిందా? ఉహు.

కొన్నాళ్ళకు ఈ సోషల్ మీడియా వచ్చాకా, ఫోన్ చేసి, 'ఏంటి? నిన్న నేను మా ట్రిప్ ఫోటోలు పెట్టాను. లైక్, కామెంట్ చెయ్యలేదు...' అంటూ వాయింపుడు. సంయమనం పాటించే ఇల్లాలిని కాబట్టి సరిపోయింది కానీ, లేకపోతే హాలిడే ట్రిప్ పేరుతో కాపురాల్లో హాహాకారాలు రేగేవి కదూ.

ఇటు...

ఈ కరోనా పుణ్యమా అని ఈసారి నాకూ దొరికింది ఛాన్సు.

' ఏం పావని. బావున్నారా. ఈసారి ఎక్కడికి హాలిడే ట్రిప్? ' అని అడిగాను.

'అయ్యో, ఏం వెళ్ళడం లేద్దూ. అదేదో సినిమాలో చెప్పినట్టు తిన్నామా పడుకున్నామా తెల్లారిందా అన్నట్టు ఉంది జీవితం...' డల్ గా అంది పావని.

'పాపం. ఎంత కష్టం వచ్చింది. ఫోటోలు, సెల్ఫీలు లేవు, లైకులు, కామెంట్లు లేవు. ఇక నీ ఆకలి ఎలా తీరుతుందో ఏమో. ఎలా పొద్దుపోతుందో ఏమో. ' సానుభూతి కురిపించాను నేను. ఇన్నాళ్ళకి నా ఆత్మారాముడు శాంతించే రోజొచ్చింది!

❋ | ❋

అటు...

'ఇదిగో, ఊరగాయలే మాకు పంచప్రాణాలు... ఊరగాయల కోసం ఊళ్ళమ్ముకున్న చరిత్రలు మావి. కంచంలో వంద వడ్డించు, కానీ ఏదోటి ఎర్రగా ఆనకపోతే, భోం చేసినట్టుండదు తెలుసా?'

'అలాగామ్మగోరూ. అందుకేనాప్రతి ఏడాది ఇంత కష్టపడతారు. ఊరంతా కలతిరిగేసి, ఆడనుండీ కారం, ఈడనుండీ కాయ... అంటూ ఒకటే హడావిడి. ఎంతైనా మీ పచ్చడి రుచే వేరమ్మగోరూ.' సోపేసింది సుబ్బమ్మ.

'ఆ, ఆ తెలుసులే. కొత్త ఊరగాయ కాంగానే కాస్త ఇస్తాలే. రుచి చూద్దూగాని.అన్నట్టు వచ్చేవారం నాగాలు పెట్టకు. చుట్టాలొస్తున్నారు. అసలే నా కాళ్ళు చేతుల్లో బలం లేదు. చేసుకోలేను, నీకు తెల్సుగా.' ప్రసన్నమవుతూ అభయమిచ్చాను నేను.

'అలాగేనమ్మా. నాగా పెట్టను. రేపు ఖాళీ సీసాలు తెస్తాను. అన్నీ కాస్తంత పెట్టండి.' రిక్వెస్టింగా డిమాండ్ చేసింది తను.

ఇటు...

'అమ్మగోరూ. బాగున్నారా. ఏంటో ఎక్కడచూసినా బందోబస్తు, ఎక్కడికీ పోనిస్తలేరూ, రానిస్తలేరూ. ఓపిక లేని మడిసాయె... మీరు ఎట్టా పని చేసుకుంటున్నారో ఏమో! అన్నట్టు మీ పంచపానాలు, అదేనమ్మా ఊరగాయలేం చేసారు ఈసారి? ఏంటో మీ ఇంట్లో ఏసంకాలం వచ్చిందంటే పెళ్ళి సందడిలా ఉండేదమ్మా. ఆ ముచ్చట్లు, కబుర్లు చెప్పుకుంటూ పని చెయ్యడాలూ! ఆ సందడే లేదమ్మా ఈసారి.' ఫోన్ చేసి అడిగింది సుబ్బమ్మ.

'ఆ, ఆ బాగున్నాం. అవసరం అన్నీ నేర్పుతుందనీ... ఏదో నెట్టుకొస్తున్నాం పనంతా. అసలు ప్రాణాలకే ముప్పంటే, ఇక పంచప్రాణాల కోసం పాకులాట ఎందుకు? బతికుంటే బలుసాకు తినచ్చు, అంటారు. ఈ ఏడాది ఊరగాయలు గోవింద. కాల మహిమ.' అంటూ దోశ తిప్పాను నేను, మనసులో జై జంధ్యాల పికెల్స్ అనుకుంటూ.

❋ | ❋

అటు...

హలో హలో ! మావిడికాయ పప్పు లోకి వడియం ఏది? ఊరుమిరపకాయ ఏది? ఎప్పటినుంచో వస్తున్న కాంబినేషన్స్ మార్చకూడదు. కందకు బచ్చలి లాగా, వంకాయకు చిక్కుడుకాయ లాగా, సాంబారుకు అప్పడంలాగా, మామిడికాయ పప్పుకు వడియం, ఊరుమిరపకాయ వేయించి వెయ్యకపోతే... మొగుడూపెళ్ళాలకీ, శివుడికీ నందికీ, మధ్యలోంచి నడిచినంత పాపమట, తెలుసా?'

'వచ్చె, వచ్చే... ఆపండి మీ ఉపన్యాసాలు. మహాప్రభో నూనె పెట్టాను. వేయిస్తున్నా. నాకు తెలీదా మీ భోజన ప్రియత్వం... ?'

ఇటు...

'చూడు. ఈసారి వడియాలు, ఊరుమిరపకాయలు అంటూ అట్టే ఆయాసపడ బోక. ఏవో ఉన్నవి తిందాంలే ఈ ఏడాది. రోజంతా కాకులతో సహజీవనం చేసి, ఎండలో మాడిపోయి, కష్టపడకు. ఆనక నీకు, దానికి కలర్లో తేడా తెలుసుకోలేక నాకు కష్టమవుతుంది. అంతగా అయితే కొనుక్కుందాం లే. ఏమంటావ్?'

'ఆహా, ఎన్నేళ్ళకు కరుణించారీ భోజన చక్రవర్తి! మీ జిహ్వాచాపల్యాన్ని చంపేసిన కరోనాకు శాంతి బహుమతి ఇవ్వాల్సిందే. పోన్లెండి. నాకో పని తప్పిందీ సారి!' మనసులో మురిసిపోతూ అన్నాను నేను.

❋ | ❋

అటు...

'అబ్బాయి భవిష్యత్తంతా ప్లాన్ చేసేసామండి. కెజీ నుంచి టెంత్ దాకా టెక్నో స్కూల్, ఇంటరు ఫిడ్జీ, ఆపైన ఇంజినీరింగ్, యుఎస్ లో ఎమ్మెస్... వాడిలైఫ్ సెట్. అన్నీ అనుకున్నట్టే అవుతున్నాయి. ఈ ఏడు వాడి ఇంజినీరింగ్ అయిపోయి, యుఎస్ పంపేస్తే ఇక మాకు ఏ దిగులూ ఉండదు. అసలు ప్లానింగ్ ఉన్న లైఫ్ కి తిరుగుండదండీ...' చెప్పుకుంటూ పోతున్నాడో బీరకాయపీచు వరస బాబాయ్ చుట్టం.

'అవునవును...' అని మొహమాటంగా నవ్వుతున్న నా మనసులో అంతరాత్మ ఘోష... 'ఇదో ప్లానింగేంటి, పదేళ్ళనుంచి ఇదేగా తంతు. ఇలా ప్రతివాడూ పిల్లలకు ఇంజినీరు కొనిపెట్టబట్టే, ప్రస్తుతం దేశంలో వాళ్ళ డిగ్రీలకు గంజినీరు కూడా పుట్టకుండా ఉంది. అమ్మండయ్యా, అమ్మండి! మన యువత ఉత్తేజాన్నంతా విదేశాలకు తాకట్టు పెట్టండి. ఆ తర్వాత తీరా పిల్లల్ని అక్కడకు పాంపాకా కనీసం చితికి నిప్పైనా పెట్టే దిక్కు లేక అల్లాడండి. ఎంతమందిని చూడలేదూ? మళ్ళీ ప్లానింగ్ కమీషన్ ఛైర్మన్ లా ఆ దిక్కుమాలిన బిల్డప్ ఒకటి. ' అంటూ సాగిపోతున్న ఆలోచనా పరంపరకు తలుపులేసాను, ఆయన్ను పంపేస్తూ.

ఇటు...

నిన్న మూతికి ముసుగేసుకుని కూరగాయలకోసం వచ్చి దొరికాడు సదరు జీవుడు. చిక్కిందే ఛాన్సు. వదుల్తానా!

'ఏవండోయ్, బాబాయ్ గారూ. బాగున్నారా? మా ఇంటికోసారొచ్చారు గుర్తుందా. అన్నట్టు మీ అబ్బాయిని యుఎస్ పంపేసారా. ఎంతైనా మీరన్నట్టు, ప్లానింగ్ ఉంటే కానిదేముంది చెప్పండి!'

వెంటనే ఆయన మొహంలో లైటారిపోయింది. 'ఆ, బాగున్నామమ్మా. ఏదీ! సమయానికి ఈ మాయదారి కరోనా వచ్చి పడింది. ఇప్పుడు పదేళ్ళనుంచి అక్కడున్నవాళ్ళకే దిక్కులేదు. ఇక కొత్త వాళ్ళకు వీసాలు లేవని ట్రంపెట్ మామ చెప్పేసాడట. మీకు ఇంకో సంగతి తెలుసా? ఈ కరోనా దెబ్బకు పట్నాల కంటే పల్లెలే క్షేమమని చాలా మంది సొంతూళ్ళకు పారిపోయారు. విదేశాల్లో ఉన్నవాళ్ళు ఆయా ప్రభుత్వాలు తన్ని తగలేసే దాకా ఎందుకని ముందే తిరిగొచ్చేసి, ఊళ్ళో వ్యవసాయం చేసుకుంటున్నారట. స్టూడెంట్స్ ఇంటి ఓనర్లు ఖాళి చేయించి, యూనివర్శిటీ లు స్టైఫండ్లిచ్చే తాత్కాలిక ఉద్యోగాలు కూడా మాన్పించగా, నానా అగచాట్లు పడుతున్నారు. అందుకే మావాడిని పంపకూడదని అనుకున్నాము. ఇక్కడే ఏ ఎంబిఏ నో చేయించి, కాంపస్ లో వచ్చిన ఉద్యోగంలో చేరమంటున్నాం. అంతా విధి ఆడిన వింత నాటకం.'

108 ప్రాముఖ్యత ఏమిటి?

మనం ఏదైనా మంత్రం జపించడానికి 108 సంఖ్య ముఖ్యం. అష్టోత్తరాలలో 108 సంఖ్య నామాలతో దేవతలను ఆరాధిస్తాము. ఇందుకు ప్రముఖమైన కారణం 27 నక్షత్రాలు, ప్రతి నక్షత్రానికి 4 పాదాలు = 27 × 4 = 108 అని, ప్రతి మనిషి ఈ 108 నక్షత్ర పాదాలలో ఒకదానిలో పుట్టి ఉంటాడు కావున ఈ సంఖ్యకు అంత ప్రాముఖ్యత అని తెలుసు. కానీ వీటికన్నా మరెన్నో ఆశ్చర్యకరమైన విషయాలు ఈ సంఖ్యతో ముడిపడి ఉన్నాయి. అవేమిటో ఒకసారి చూద్దాము.

ఖగోళ పరంగా

సూర్యునికి, భూమికి ఉన్న దూరం 149.6 million kms. ఈ దూరాన్ని సూర్యుని చుట్టుకొలత 1391000 kms తో భాగిస్తే వచ్చే సంఖ్యా రమారమి 108.

అలాగే చంద్రునికి, భూమికి ఉన్న దూరం 38లక్షల కిలోమీటర్లను చంద్రుని చుట్టుకొలత అయిన 3474 kms తో భాగిస్తే వచ్చే సంఖ్య 108

27 నక్షత్రాలు, ప్రతి నక్షత్రానికి 4 పాదాలు = 27 × 4 = 108

12 రాశులు , 9 నక్షత్ర పాదాలు = 12 × 9 = 108

హైందవం ప్రకారం

ముఖ్య శివలింగాలు 108, అందుకే శైవ మతాలు కూడా 108.

గౌడియ వైష్ణవంలో బృందావనలో 108 గోపికలను పూజిస్తారు.

108 వైష్ణవ దివ్య క్షేత్రాలు

కంబోడియాలో ఆంగ్కోర్ వాట్ గుడిలో 108 మంది (అసురులు, దేవతలు) కలిసి సాగరమధనం చేసినట్టు చిత్రింపబడివుంది.

హైందవ భావాలనుండి ప్రేరణ పొందిన బౌద్ధం ప్రకారం పంచేంద్రియాలతో స్పృహ ను కలిపి ఆరు భావాలను, వాటివల్ల కలిగే అంతర్భావాలైన సుఖము, దుఃఖము, స్తిరత్వబుద్ధిని, గుణించి, అవి బాహ్యంగానైనా, ఆంతరంగానైనా భూత భవిష్యద్ వర్తమానాలలో కలిగిన భావనలను గుణిస్తే 6×3×2×3=108

ఒక జీవుని ప్రయాణం "పూర్ణమదః పూర్ణమిదం. ఓం పూర్ణమదః పూర్ణమిదం పుర్ణాత్పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే" ద్వారా ఇన్ఫినిటీ (8) కు చేరుకునే విధానం 108 symbolism.

ఆయుర్వేదం ప్రకారం 108 మర్మ స్థానాలు, శక్తి కేంద్రాలు

కలారిపయట్టు ప్రకారం (తరువాత కరాటే గా మారింది) 108 pressure పాయింట్స్

108 డిగ్రీల జ్వరం వచ్చినప్పుడు శరీరంలో ఉన్న అన్ని అవయవాలు చచ్చుబడిపోతాయి.

108 జపం మనస్సును నిర్మలం చేస్తుంది, లోపలున్న భావాలను అణగదొక్కుతుంది.

సంస్కృత భాషలో 54 అక్షరాలు ఉంటాయి. వాటికి శివ, శక్తి తత్త్వాలైన స్త్రీ, పురుష రూపాలుంటాయి. 54×2 =108

12000 దివ్య సంవత్సరాలు వ 43,20,000 మానవ సంవత్సరాలు వ బ్రహ్మకు ఒక పగలు = 4000 × 108

108 లో 1 జీవుడిని తెలియచేస్తుంది. 8 జీవుని తత్త్వాలను తెలియ చేస్తుంది. 0 – పరిపూర్ణ భగవత్తత్త్వము. ఈ శరీరాన్ని, జీవుడిని కలిపి నియమించేది పరిపూర్ణ భగవత్తత్త్వము –108.

1+0+8 = 9, చాలా ముఖ్యమైన సంఖ్య. 9 తో ఏది కలిపినా వచ్చిన సంఖ్యలో numberలను కలిపితే చివరకు అదే సంఖ్య వస్తుంది

గణిత పరంగా

108 ఒక abundant number. అంటే వాటి divisors 1+2+3+4+6+12+18+27+36+54 = 163 > 108

Tetranacci number (ముందటి నాలుగు fibonacci నమ్బెర్లను కలిపితే వచ్చేది) 0, 0, 1, 1, 2, 4, 8, 15, 29, 56, 108

హైపర్ factorial 1**1 + 2**2 + 3 **3 = 108

ఒక పెంటగాన్ కోణాలు అన్నీ కలిపితే 108

ఒక refactorable number (వాటి divisors ఎన్నున్నాయో వాటితో భాగింపపడగలిగేది)

ఇంకా మరెన్నో విశిష్టతలను తనలో ఇముడ్చుకున్న సంఖ్యా

ఇటువంటి వైశిష్ట్యం ఉన్నది కనుకనే మన ఋషులు, ద్రష్టలు ఎప్పుడో 108 సంఖ్య ప్రాముఖ్యతను మనకు నామాలలో, ప్రదక్షిణలలో, జపాలలో విధిగా విధించారు. వారి దార్శనికతకు జోహార్లు అర్పిస్తూ. ●

'అయ్యో బాబాయ్ గారూ. తానొకటి తలిస్తే, దైవమొకటి తలచారని, మీకు ఎంత కష్టమొచ్చిపడింది. విధి మీప్లానింగ్ ను మూసీ నదిలో కలిపేసింది పాపం. అయినా ఈ ప్రవాసీలను స్వవాసీలను చేసిన కరోనాకు మాత్రం మంగిడీలు. ఉంటానండి, జాగ్రత్త.' అంటూ చల్లగా జారుకున్నాను నేను.

|

అటు...

'ఇదిగో ఈనెల బడ్జెట్లో పెళ్ళిళ్లకు, ఫంక్షన్లకు అదనంగా ఓ ఐదువేలు కేటాయించండి.'

'ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావిడనీ... ఏవిటీ విపరీతం నాకు? మూలిగే నక్కమీద తాటి పండు వేస్తావా? అయినా అందరూ బొకేలతో సరిపెడుతున్నారు కదా. మనకీ హైఫై లు అవసరమా. ఉన్న గ్లాసులో, కంచాలో మూటగట్టి ఇచ్చెయ్, నా వల్ల కాదు. '

' అలాగా! ఫర్ యువర్ క్లైండ్ ఇన్ఫర్మేషన్... ఇప్పుడు బొకేలు కూడా ఐదు నూర్లు పెట్టందే రావట్లేదు బాబూ. జనాలు పళ్లాలు, కంచాలు గిఫ్ట్ లు ఇవ్వడం మానేసి చాలా రోజులైంది. అంతా కవర్లో కాష్ పెట్టి ఇస్తున్నారు. ఇదిగో, ఆ ఐదు పెళ్ళిళ్లలో మూడు మీ వాళ్లవే. బడ్జెట్ ఇవ్వకపోతే నేను రానంతే. మీరొక్కరే వెళ్ళిరండి. సరేనా?'

'ఓహో, బెదిరింపా? అయినా, నాకు తెలీకడుగుతాను. అంతా కష్టపడి, చిప్పలు చేత బట్టుకుని, పడుతూ లేస్తూ వెయ్యి రూపాయలు అక్కడిచ్చి తినే బదులు... గబగబా నాలుగక్షంతలు వేసి, మన కుటుంబమంతా ఏ హోటలుకో పోయి, దర్జాగా తిని, ఇంటికి రావచ్చుకదా. ఏమంటావ్?'

'మీ ఐడియా నా మొహంలా ఉందంటాను. కొత్త చీరల రెపరెపలు, కొత్త నగల డిజైన్లు, పళ్లెం నిండా పదార్థాలు, వాటిలో నంజుకోడానికి బోలెడన్ని గాసిప్పులు. ఈ మజా ఆ హోటల్లో ఏమొస్తుంది కానీ, మీరు లొంగుబాటు కు సిద్ధం కండి!'

ఇటు...

'నైటీ దేవతా! పగలు రాత్రీ కప్పీ లాగా ఈ అవతారం తప్ప ఇంకో అవతారం లేదా? అన్నట్టు ప్రతి సమ్మర్లో మీ పెళ్లిళ్ల హడావిడులు, చీరల రెపరెపలు ఈసారి లేవుగా, పాపం నీకు చాలా బోరు కొడుతోందేమోనే!' వెటకారాలాడారు శ్రీవారు.

'మీ అమాయకత్వానికి నాకు ముచ్చటేస్తోంది. చీరల రెపరెపలు ఎందుకు లేవూ? సోషల్ మీడియాలో రకరకాల ఛాలెంజ్ ల పేరుతో ఎక్కడ చూసినా రంగుల రెపరెపలే. కావలిస్తే 'సారీ ఛాలెంజ్' అని హాష్ టాగ్ కొట్టి చూడండి, డిజైన్లే డిజైన్లు. బాగా మేకప్పుయ్యి, ఓఫోటో తీసి పెట్టి, మళ్ళీ మామూలు అవతారానికి వచ్చి, మా ఆడలేడీస్ అంతా ఇంటిపని చేసుకుంటున్నార్రు. కావలసినన్ని గాసిప్పులు టీలు, జూసులు, కాఫీలు సిప్ చేస్తూ వీడియో కాల్ లో చెప్పుకుంటున్నారు. సరేగాని, ఈసారి ఖర్చులెక్కువ లేవు కదా. పైగా పెళ్లిళ్ల బడ్జెట్ కూడా మిగులేనాయె. లాక్డౌన్ అవగానే నాకొక రవ్వల నెక్లెస్ కొనిపెడుదురుగాని, సిద్ధమవ్వండి...' రివర్స్ పంచ్ కొట్టాను నేను.

'ఎరక్కపోయి నిన్ను కదిలించాను మాతా! అయినా నైటీ వేసుకుంటేనేమి, నువ్వు భులోక దేవతలా మెరిసిపోవట్లేదూ. శరణాగతుడ కరుణించగదే...' అంటూ దారికొచ్చారు శ్రీవారు. నేను చిద్విలాసంగా నవ్వాను... టీవీలో త్యాగరాజకీర్తన చెవులకింపుగా వినవస్తోంది....

"సమయానికి తగు మాటలాడెనే!"

అనుకుంటాం గానీ భయ్యా! మనం ఎన్ననుకున్నా అటూ ఇటూ అంతటా నిండిన పరమాత్మ పంచ్ కొడితే మాత్రం మన జీవితాలు రివర్స్ గేరే. ఏది లేకపోతే బతకలేమని మనం బీరాలు పలుకుతామో, అవన్నీ లేకపోయినా హాయిగా బతగ్గలమని చెప్పడానికే ఈ లీలలు చూపుతాడాయన. లెంత్ ఎక్కువైనప్పుడల్లా ఇలా కరోనా లాంటి వాటి రూపంలో దేవుడు మన తోకలు కత్తిరించి, మనల్ని దారికి తెస్తాడన్నమాట... అంతా విష్ణుమాయ! **– భావరాజు పద్మిని**

గళమెత్తిన కలం కందుకూరి రామభద్ర గళం

ఎంత చక్కనిదోయి ఈ తెలుగు తోట – ఎంత పరిమళమోయి ఈ తోట పూలూ – అన్న కందుకూరి రామభద్రరావు

పవ్వళించినదోయి పాపాయి తొట్టిలో
పాలబుగ్గల పసిమి పూలు పూచినదోయి
నిదురబోయిన పాప వదనమండలములో
ఎందుకో వికసించు నీ భావ చిత్రాలు

అంటూన్న ఆ కలమే –

ఈ త్రివర్ణ జయపతాక
ఈత్రయా పథ పతాక
గగనవీధి నెగసెరందు
కరము మోడ్చి మ్రొక్కరందు

– అన్నారు. ఆయన గోదావరి పరివాహక ప్రాంతీయుడైనట్టు, ఆయన రచించిన గీతం –

పొంగుతూ వచ్చిందిరా గోదారి
రంగులో మెరిసిందిరా
తరగచేతులపైన నురగ సొమ్ముల వెల్గ
ఆటలే ఆడిందిరా, మధురముగా
పాటలే పాడిందిరా –
అత్తింటికనిబోవు
ఆడపడుచునుబోలె
పసుపుకుంకుమందెరా –
సిగ్గుతో మిసిమి నవ్వులు నవ్వెరా
పడుచుప్రాయపు పొంగుపట్టలేకెదలోన
పరుగెత్తిపోయిందిరా! జలధితో
ప్రణమైక్యమందిందిరా ॥

– అంటూ ఆయన గోదావరి తల్లిని ఓ ఆడపడుచు చందాన కీర్తిస్తూ, సాగరున్ని చేరుతున్న గోదావరిని అత్తవారింటికెళ్లే ప్రణమైక్యసుందరిగా కీర్తించడంలోనివి చాతుర్యం ఘనంగా దీప్తించడమే గాకుండా, కవి ఉనికిని కూడా చెప్పకనే చెబుతూంది.

నూటొక్క సంవత్సరాల క్రితం వ్రాయబడిన గేయమంటే ఎవరైనా నమ్ముతారా? రచనలో ఎన్నో ఆధునిక సొగసులు న్నాయీ, గుభాళింపులున్నాయి!

ఆపరా ఒకసారి ఆ మురళిరవము
తీపి ఎదనింక ఓపలేనుర కృష్ణ –
ఆపి వేణువొకింత ఆదుముకో నన్నెదకు –

అన్న పాటలోనూ –

వేళకాని వేళయింత
పూలకారు సొగసులేల?
కుదురులేక ఎడదయింత
చెదరిపోవు నిలువలేక
కులుకులొలుకు ప్రియునితోడ
కుసుమ పాత్రలోన చేరి
మధువు నాను మదుపొంగన
మనసు మనసులోన లేదు

– అన్న పాటలోనూ

ఓపలేనే మనసు ఓ మల్లెపూవా
దాపలేనే వలపు – వేచునా యెదలోనా

అన్న గేయంలోనూ, ఎన్ని గాయాలను మ్రాన్పు వసంతం ఉందో చెప్పగలమా? ఇహ దేశభక్తి విషయానికొస్తే –

భారతమాతకు మంగళమ్
శూరప్రసూతకు మంగళమ్
నిగమవిహారిణి జగదుపకారిణి
సదయహృదంతర ముదిత దిగంతర
మిత్రప్రకాశిక – శాత్రప్రకాశిక
వినుత మహోగుణ జన పరితోషణ

– ఏంవి అక్షర అమరిక, ఏంవి పదపొందిక. అభ్యుదయాన్ని పరికిద్దామా –

వెలిగింది ఓ క్రొత్త జ్యోతి
బీదసాదల పెన్నిధిగ – సన్నిధిగ
ఉనికిలో యనికిలో ఊహాపథమ్ములో
కాంతి నిండింపగా క్రాంతి పండింపగా
తోడుగా నీడగా వాడవాడలు గలిపి
మంటిలో మానవులు – మానికాలై మెరయగా–

పీడిత జనావళిపట్ల క్రాంతినాశిస్తూ మట్టిలో మాణిక్యాలై వరలాలని కలలు కన్న క్రాంతి జీవి, కవితానురాగి కందుకూరి రామభద్రం.

తెలుగు భాషకున్న కమ్మదనం తియ్యందనం, పదమందార మకరందం, మాధుర్యతను తెలియచెప్పిన తీరు, సౌరు, అహ్వో – తెలుగు కవులకే చెల్లు, తెలుగుకున్ చెల్లు!

ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, తీయటి తేటతెలుగు ఉపన్యాసాలిస్తూ, విజయవాడలోని (తొలి) ఆకాశ కేంద్రంలో దశాబ్దం పాటు విద్యాకార్యక్రమాల ప్రయోక్తగా వ్యవహరించిన తీరు మహోజ్జ్వమయినది.

ఇలాటివారిని ఏ పత్రికలు వ్రాస్తున్నాయ్. ఏ చిత్ర నిర్మాతలు సెల్యూలాయిడ్‌పై ఇలాటి గేయాలు చిత్రీకరణ చేయగలిగారు. అంతా పరిమితి పరిధి, ఒకే కుడితగుంటలో మసలడమే కదా.

తెలుగుతల్లీ చెప్పవమ్మా – నిన్ను కండ కండలుగా, తుండ తుండలుగా త్రుంచాలనుకుంటున్నారు కదమ్మా – తెలంగాణా తల్లియట, ఉర్దూ తల్లియట – జిల్లాకొక తల్లినీ, మండలానికో తల్లినీ చేసి చెప్పినా ఆశ్చర్యపోవద్దమ్మా! ఈ బేధాలను మరచిపోవడానికైనా ప్రాచీన కవులనూ, వారి కవితనూ స్మరిద్దామమ్మా!

ఒకరు నేల త్రుంచీ – ఒకరు తల ధరించే పువ్వు యొక్క మృదు మనసు పువ్వుకు తప్ప వేరెవ్వరికీ రాదమ్మా. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

ఆంధ్రా హాలీవుడ్ ఆద్యులూ చలనచిత్ర వైభవాధినేతలూ

నాగిరెడ్డి, చక్రపాణి

లనే చెప్పకోవాలి!

చెన్నపట్నమును చలనచిత్ర రంగ కాణాచిగా, ఆంధ్రా హాలీ వుడ్‌గా కీర్తింపచేసిన ఘనులెవ రని ప్రశ్నించినప్పుడు నాగిరెడ్డి, చక్రపాణి యనే రెండు పేరులు మాత్రమే వినిపిస్తాయ్! వారి ప్రతిభా సామర్థ్యాలను కళ్లారా చూచినవాణ్ణి కాబట్టి నేనూ అదే అనుభూతికి వచ్చి, నాతో గోష్ఠి సలిపిన (నన్ను ఇంటర్వ్యూ చేసిన) 'మా టీ.వీ.' వారికి కూడా చెప్పాను. వారు మంచి కథలతో సినిమాల్ని తీయడమే గాకుండా, మంచి నటీనటులను కూడా పరిశ్రమకు అందజేశారు. మంచి సాంకేతిక విజ్ఞుల్ని పరిశ్రమకందజేశారు. మేల్మంచి స్టూడియోను, లేబొరేటరీని, చిత్రనిర్మాణానికనువైన తోట, తోటలో కోటగా ఉండే ధ్వనిముద్రిత థియేటర్లను ఓ మంచి సంగీత వాయిద్యమును కూడా పరిశ్రమకు అందచేశారు.

అత్యద్భుత, రమణీయమైన ముద్రణనిచ్చే ప్రసాద్ ప్రాసెసింగ్ యూనిట్, బి.ఎన్.కె. ప్రెస్, చందమామ పత్రికలూ వీరివే! ఆకాశంలో ఎన్ని నక్షత్రాలున్నప్పటికినీ, 'చందమామ' కున్న ప్రాధాన్యం 'చందమామ'దే. అన్నట్టు వీరి 'చందమామ' పత్రిక అంతటి ప్రాచుర్యం సంపాదించింది.

అయిదో ఫారం వరకూ రాయలసీమ కడప జిల్లాల్లో చదువుకున్న నాగిరెడ్డీ, శరత్ నవలల అనువాదంపై అభిరుచీ, అనుభవ ప్రావీణ్యమూ సంపాదించిన ఆంధ్రా జిల్లా 'పారీస్'గా ప్రఖ్యాతి పొందిన తెనాలివాసి చక్రపాణీ (అస్సలు పేరు ఆలూరు వెంకటసుబ్బారావు) ఇద్దరూ, ఊరిలోని ఉప్పూ, అడవిలోని చెట్టుకాయ కలిసి ఆవకాయయైనట్టూ, రాయలసీమ నాగిరెడ్డి ఆంధ్రసీమ చక్రపాణీ కలిసి చదువరుల చందమామ, సినిమావరుల 'విజయా ప్రొడక్షన్స్' అయ్యారు. దేశ స్వాతంత్ర్యం సిద్ధించడానికి ముందే ఈ ఇద్దరూ మనమిద్దరం అంటూ చేతులు కలిపారు. నేనిద్దరిని కథ, కథనం కొరకూ, నీవటు సినిమా సాంకేతికపర నిర్మాణం వైపు నడుము కట్టూ అంటూ కూడబలుక్కున్నారు. చక్రపాణికి పి. పుల్లయ్య 'ధర్మపత్ని' చిత్రానికీ, బి.యన్. రెడ్డి 'స్వర్గసీమ' చిత్రానికీ కథ, కథనం అందించిన అనుభవం, నాగిరెడ్డికి 'స్వర్గసీమ' చిత్ర నిర్మాణ సందర్భంలో కలిగి ఉన్న అను భవం, వాహినీ స్టూడియోను 'షావుకారు'గా చేబట్టిన నేతృ త్వంలో విజయా ప్రొడక్షన్సును స్థాపించి, విజయ పతాకంపై హనుమంతుడు లంకను లం ఘించే 'ముద్రిక'ను ముద్రించి, 'షావుకారు'తోనే చిత్రం ప్రారం భించారు. నటునిగా దర్శకునిగా అనుభవం ఆర్జించిన (స్టూడి యోలు, ఆర్జించలేదు, సినిమాలు తీయలేదు) ఎల్వీ ప్రసాద్ చేదోడు జోరుతో 'షావుకారు' విడుదలై హుషారు కూర్చింది. హీరో ఎన్టీ రామారావు, హీరోయిన్ జానకికీ ప్రతినాయక పాత్రధారి ఎస్వీ రంగారావు గారికీ యశస్సును తీసుకుని రావడమే గాకుండా, ఘంటసాలను గాయకునిగానూ, సంగీత దర్శకునిగానూ, డిమాండు ఏర్పరిచించి వారిని 'రిమాండు'లో వాహినీ వారి 'కాంపౌండు'లో బంధించేసింది. అటుతరువాత 'పాతాళభైరవి' పాతాళంనుంచీగల జానపద చరిత్రనంతా పెకలించింది – కె.వి. రెడ్డినో చలనచిత్ర, వీర, ధీర డైరెక్టర్ని చేసింది. మిస్సమ్మ, చంద్రహారం, గుండమ్మ కథ, మాయాబజార్ – ఇలా ఇలా పుంఖాను పుంఖ చిత్రాలతో విజయాలు దక్షిణాది, దక్షిణాఱేతర నిర్మాతల పునాదుల్ని లేపేసింది. వాహినీ, రేవతీ స్టూడియోలను క్రయం చేసి 'విజయా – వాహినీ' స్టూడియో యంతటి విశాల స్టూడియో, నిర్మాణ సంస్థ, భారతదేశంలో లేదనెడు 'విజయభేరీ' మ్రోగింపచేశారు. నటీనటులతో బాటు ఎల్వీ. ప్రసాద్, కె.వి. రెడ్డి, కమలాకర కామేశ్వరరావు, చాణుక్య, టి. ప్రకాశరావు, కె. సేతుమాధవన్ వంటి దర్శకులను మేల్దర్శకులనే ముద్ర వేయించారు. పాతాళభైరవి, మాయాబజార్ వంటి మేల్ చిత్రాలూ, ఎన్టీ రామారావు, యస్వీ రంగారావు, రేలంగి, రమణారెడ్డి, సావిత్రి, జమున వంటి నటవర్గాన్ని చిత్రసీమ కందించిన ఖ్యాతి విజయా వారికే దక్కింది. అంతకన్నా మంచి నటీనటులను మరొక నిర్మాతలెవరూ పరిశ్రమకింతవరకూ యివ్వనేదనే చెప్పాలి.

1975 సం॥ములో చక్రపాణి మరణించడంతో నాగిరెడ్డికి వెన్నెముక విరిగినట్లయింది. చిత్రనిర్మాణంపై ఆసక్తి సన్నగిల్లింది. ఈ మాటల్ని ఎన్నో పర్యాయాలు నాదగ్గర అన్నారు. స్టూడియో అభివృద్ధీ సన్నగిల్లింది. 'చందమామ' కాంతులు తగ్గాయ్. తదుపరి తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులుగా తిరుమల స్వరూపాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దారు. ఇప్పటికీ ఆ కొండలలోని ప్రారంభములోగల గీతోపదేశం శిల్పమొకటే నాగిరెడ్డి గీటురాయి తనాన్ని స్ఫురింపచేస్తూంటుంది. నెల రోజుల్లో బ్రహ్మాండమైన విజయా శేష్‌మహల్ కళ్యాణమండపాన్ని తీర్చిదిద్దిన ఖ్యాతి కూడా నాగిరెడ్డి గారిదే! ఆయన్ను ఎన్నో బిరుదులు వరించాయ్, ఆ బిరుదులకు విలువను కల్పించాయ్.

నాగిరెడ్డి, చక్రపాణిల నిష్క్రమణంతో తెలుగు సినిమా తీరుతెన్నులే మారి పోయాయి. ఆకసాన చందమామను చూచి లొట్టలేసినట్టు వారి జంట చిత్తరువులను చూచి 'అహ మన తెలుగు సినిమా ఎంత ఘనమైనదీ' అన్న లొట్ట లేసుకోవలసి వస్తున్నదే తప్ప మరో ఘనత ఎవరిదీ కానరాలేదు. ఆ యిరువురి చెలిమీ మరువరానిది. ●

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

జి.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

అఖండ శక్తి, అఖండ ఉత్సాహం, అఖండ ధైర్యం, అఖండ సహనం ఇవే మనకు ఆవశ్యకాలు. అప్పుడే మహత్కార్యాలు సాధింపబడతాయి.

\- స్వామి వివేకానంద

మనిషిలోని అన్ని దుర్గుణాలకి కారణం అహంకారం. మన దేశంలో ఇప్పుడు జరుగుతున్న కొన్ని సమస్యలకు కారణం అప్రజాస్వామిక కార్యనిర్వాహణలే! దేశం పురోభివృద్ధి సాధించటానికి, అందరికీ సమానవకాశాలు ఉండాలన్న ఆలోచన మంచిదే. కాని దాన్ని ఆచరణలో పెట్టడంలో మన నాయకులు ఎన్నుకున్న లేక అవలంభిస్తున్న మార్గమే తప్పు. కేవలం వారు పదవిలో ఉండటం కోసం అడ్డదారులు త్రొక్కుతూ ప్రజలను జాతులుగాను, మతాలుగాను వేరుచేస్తూ, వారియొక్క పబ్బం గడుపుకుంటున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అంటూ నినాదాలు చేస్తూ, వాటిని ఏవిధంగా దురుపయోగం చేస్తున్నారో పెద్దలకు, మేధావులకు తెలుసు! కాని అందరూ ఎందుకు నోరు మెదపటంలేదు? అలాగే స్వేచ్ఛ అంటే చాలామంది ఎవరికి తోచినట్టుగా వారు జీవించడంగా అనుకుంటున్నారు. ఈమధ్య టి.వి.లో ఒక అమ్మాయి మాట్లాడుతూ ఆవిడ ఏమి తినాలో (గొడ్డు మాంసం) ఎలాటి దుస్తులు ధరించాలో వాటికి నియమాలు, నిబంధనలు ఉండకూడదు. అదే ఆవిడగారి దృష్టిలో స్వేచ్ఛ అంటే, ఇక సమానత్వం ఆర్థిక సమానవత్వాన్ని, చట్టపరమైన సమానత్వాన్ని ప్రజలందరికి సమానంగా ఉండవచ్చు. కాని బుద్ధిలోను, మనోబలంలోనూ, అర్థం చేసుకునే స్థితిలోను, విచక్షణాశక్తిలోను, నిజాయితీలోను, సృజనాత్మకత లోనూ మనుషుల మధ్య సమానత్వం ఉందా?

పెద్దమనుషులలాగా, బడా నాయకుల లాగా కనబడే వారం దరూ వారి స్థాయికి తగ్గట్టుగా లేరు. వారియొక్క సుఖాల కోసం, పదవి కోసం విలువలను దిగజారుస్తున్నారు. చట్టాలను మారుస్తున్నారు. ఆఖరికి సుప్రీంకోర్టు తీర్పులకు కూడా సవరణలు చెయ్యడానికి సాహసిస్తున్నారు. సినిమావారు, మీడియా వారు, రాజకీయ నాయకులు, నటీనటులు నీతి న్యాయం, మానం, మర్యాదలన్నీ వదిలేసి జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని కోల్పోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగనున్న బై ఎలక్షన్లకు పోటీపడుతున్న ప్రధాన పార్టీలన్నీ గెలుపును లక్ష్యంగా చేసుకొని ఎవరికి తోచినవి (నోటికి వచ్చినవి) చెపుతూ జనులను మభ్యపెడు తున్నారు. జనులకు కూడా ఎవరిని ఎన్నుకోవాలో తెలియని గందరగోళ పరిస్థితి కలుగుతున్నది. ఇట్టి పరిస్థితిలో జనానికి మంచి ఏదో, చెడు ఏదో నచ్చచెప్పే నాయకులు కరువయ్యారు. స్వామి వివేకానందవంటి స్వాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి నాయకులు, భగవత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి త్యాగులు లేకపోవడం మన దురదృష్టమే అనుకోవాలి.

* * *

సోనూ సూద్ తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యిన పేరే, తెలుగు సినిమాలలో విలన్ (ప్రతి నాయకుడిగా) చాలా సినిమాలు చేశారు, ఈ కొరోనా సందర్భంగా ఆయన చేసిన అద్భుత మహత్తర కార్యం అందరిచేత ప్రశంసింపబడటమే కాకుండా, ఆయన్ను ప్రజల మనసులో కథానాయకుడిగా నిలబెట్టింది, ప్రాంతీయ, జాతీయ మీడియాలన్నీ ఆయన్ను ప్రశంసించాయి. తన స్వంత డబ్బుతో వలస కార్మికులని రైళ్ళలోను, బస్సులలోను, కొంతమందిని విమానంలో కుడా పంపించాడు , అంతేకాదు తన మిత్రులతో కలిసి కొన్ని వేలమందికి భోజన ఏర్పాట్లు చేశాడు.

ఇదిగో ఆయన మాటల్లోనే "నేను ఒక్కప్పుడు వలస కార్మికుడినే.. పొట్ట చేత పట్టుకొని ముంబయ్ వలస వచ్చిన వాడినే..!! రైళ్లలో కిక్కిరిసిన జనరల్ బోగీలో బాతరూమ్ పక్కన్న తలుపు పట్టుకొని వేలాడుతూ ఎన్నోసార్లు ప్రయాణాలు చేసాను... ఆ బాధలు ఎలా ఉంటాయో తెలుసు. అందుకే లాక్ డౌన్ వేళ ఉపాధి కోల్పోయి తిండి లేక సొంతూరు చేరుకునే మార్గం లేక వాళ్ళు పడుతున్న అవస్థలు చూసి వేల కిలోమీటర్లు పిల్లలతో కొంత మంది కాళ్ళకి చెప్పులు కూడా లేకుండా నడిచి వెళుతుంటే మనసు చలించిపోయింది... నా కెరీర్ మొదట్లో నేను పడిని కష్టాలు కళ్ళ ముందు మెదిలాయి... సహాయ కార్య క్రమాల్లో మొదటి అడుగుగా జుహు లోని నా హోటల్ని ప్రాణాలు పణంగా పెట్టి కరోనాతో పోరాడుతున్న వైద్యులకు ఇచ్చాను... ముంబయ్ పరిసర ప్రాం తాల్లో పట్టేడు అన్నం లేక అలాంటి స్తున్న దాదాపు 40 వేల మందికి అన్నదానం మొదలుపెట్టాను. తరవాత ఇంకా ముంబయ్‌కి దూరంగా వంటగదులు ఏర్పాటు చేసి ఆరోగ్యకరమైన భోజనం తయారుచేసి వడ్డించామ్.

ఆకలి తీరినా వాళ్ళ కళ్ళలో ఏదో తెలియని బాధ... ఏంటని అడిగితే మా సొంత గ్రామలకి పంపించండయ్య అని అడిగేసరికి ఆలోచించకుండా అధికారులతో పోలీస్ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి బస్సులు ఏర్పాటు చేసాం...వాళ్ళు వెళ్ళేటప్పుడు వాళ్ళు కళ్ళలో నుండి వస్తున్న కన్నీళ్ల చూసి చలించిపోయాను. ఒక గర్భిణి ఇంటికి చేరుకున్నాక ప్రసవించి తన కొడుకుకి సోనూసూద్ శ్రీవాత్సవ్ అని పేరు పెట్టు కుంది... ఎక్కడ వలస కార్మికులు ఉంటే అక్కడకి వెళ్లి నాకు అవకాశం ఇవ్వండి మిమల్ని మీ గ్రామాలకి పంపుతాను అని అడిగి కొన్ని వేల మందిని వాళ్ళ స్వస్థలాకి పంపాను..వాళ్ళు వెళ్ళుతూ నాపైన చూపించిన ప్రేమ వారి కళ్ళలో ఆనందం చూసి ఇక ఈ జన్మకి ఇది చాలు అనుకున్న... నాకు తోడుగా నా భార్య పిల్లలు... స్నేహితులు సహకారం... మరి ముఖ్యంగా అధికారులు పోలీసులు తోడ్పాటు మరువలేనిది"

మనమూ హీరోలు సహాయం చెయ్యడం చూశాం, కాని ఇంతలా చేసినవారిని చూడలేదు.

ఆ దాతృత్వం ఏంటి? ఒక ఉన్మాదం ఆవహించినట్టు..అంత మంచితనం ఈ ప్రపంచం తట్టుకోగలదా??... బహుశా ఇప్పటికీ వర్షాలు పడుతున్నాయంటే ఇలాంటి వాళ్లవల్లనే..

ఒడియా కు చెందిన 177 మంది మహిళలు కేరళలోని ఎర్నాకుళం ఎంబ్రాయిడరీ కంపెనీలో పనిచేస్తూ లాక్ డౌన్ సమయంలో అక్కడ చిక్కుకుపోయి నానా ఇబ్బందులు పడుతూ గత కొన్ని వారాలుగా ఉద్యోగాలు వదిలేసి మరీ స్వరాష్ట్రానికి వెళ్లిపోవాలని విఫల ప్రయత్నాలు చేస్తున్న సందర్భంలో ఒక వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు సోనూ సూద్ 'వెంటనే ఒడియా ప్రభుత్వం తరపున migrant విభాగం చూస్తున్న ఐపిఎస్ అధికారితో మాట్లాడి వాళ్లందరి కోసం బెంగళూరు నుంచి కొచ్చి కి ప్రత్యేక విమానం పంపి అక్కడనుంచి 'భువనేశ్వర్' చేర్చాడు..

ఆ 177 మందిలో ఒక మహిళ భువనేశ్వర్ వెళ్ళగానే ఒక పండంటి బాబుకు జన్మ ఇచ్చింది..

ఆ బాబుకు సోనూ మీద కృతజ్ఞతతో 'సోనూ సూద్ శ్రీవాత్సవ' అని పేరు పెట్టుకుంది ఆ మాతృమూర్తి...

అవును ఇతను మనిషి కాదు దేవుడే...

సోను సూద్ జయహో.

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే

305 నెలలుగా 305 సంచికలను

శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।

ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదంటే ఏడుకొండల తేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)

గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు

చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
June 2020

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97